సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 19-1-2024 15/-




# బంగ్లాలో హసీనా






సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 3 హైదరాబాద్
శుక్రవారం 19 జనవరి 2024 రూ.15-00
12 రజబ్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

నా దాసులారా! మీలో ప్రతి ఒక్కరూ దారి తప్పినవారే – నేను మార్గం చూపిన వారు తప్ప. కనుక సన్మార్గం చూపమని నన్ను ప్రార్థించండి. నేను మార్గం చూపుతాను.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


కథ



30

**కాలం మారుతోంది!**

## లోపల...


| | | |
|---|---|---|
| న్యాయం | ...... | 04 |
| బంగ్లాలో హసీనా | ...... | 05 |
| జీవిత అంతిమ స్థానం | ...... | 09 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)-13 | ...... | 10 |
| 'సామాజిక రుగ్మతలపై సమరం.. సమద్ ఇస్లాంవాద కథలు | ...... | 12 |
| కొత్త సంవత్సరం సరికొత్తగా మనం...! | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| విశ్వాసాలు – విశ్వాసాల వాస్తవికత, ప్రాముఖ్యత-2 | ...... | 20 |
| పిల్లలు ఏం కావాలి....? | ...... | 22 |
| వివాహబంధం పవిత్రమైనది | ...... | 25 |
| రామమందిరం సరే, రామరాజ్యం ఎక్కడ? | ...... | 26 |
| అబ్బో.... రోబో | ...... | 28 |
| అక్షర సూరీడు | ...... | 32 |


**న్యాయం గెలిచింది..**



గుజరాత్ సర్కారుకు
సుప్రీం కోర్టు చీవాట్లు
న్యాయానికి ధర్మానికి
పొడిచినదట తూట్లు!
కొంతైనా బిల్కీసుకు
లభించింది న్యాయం
పూడ్చలేరు ఎవ్వరూ
జరిగిన అన్యాయం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# న్యాయం

బిల్కిస్ బాను కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది. ఈ తీర్పు చాలా ప్రత్యేకమైనది. మహిళా న్యాయవాదులు ఒక మహిళ కోసం చేసిన పోరాటంలో ఒక మహిళా న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు ఇది. బాధిత మహిళ బిల్కిస్ బాను చెక్కుచెదరని ధైర్యంతో చేసిన న్యాయపోరాటం ప్రశంసించదగినది.

అగష్టు 2022లో ఒకవైపు ప్రధాన మంత్రి నారీశక్తి గురించి మాట్లాడుతున్నప్పుడే గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బాను సామూహిక అత్యాచారం, మూడేళ్ళ పసికందు సహా 14 మంది ఆమె బంధువులను హత్య చేసిన కేసులో నేరస్తులకు క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు మహిళలు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సిపిఎం నేత సుభాషిణీ అలీ, ప్రొఫెసర్ రూప్ లేఖ వర్మ, జర్నలిస్టు రేవతి కౌల్, తృణమూల్ కాంగ్రెస్ ఎం.పీ. మహువా మొయిత్రా, మాజీ పోలీసు అధికారిణి మీరాన్ చందా బోర్వాంకర్లు ఈ పిటీషన్ వేశారు. న్యాయవాది శోభ గుప్తా ఈ కేసులో వాదించారు. సీనియర్ న్యాయవాదులు ఇందిరా జైసింగ్, వృందాగ్రోవర్, అపర్ణ భట్ తదితరులు కూడా కేసులో పాల్గొన్నారు. ఈ మహిళలందరూ న్యాయం కోసం అద్భుతమైన పోరాటపటిమ చూపించారు. జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఈ కేసులో తీర్పు చెప్పారు. ఈ కేసులో నేరస్తులు 11 మందికి జీవితఖైదు విధించారు. కాని గుజరాత్ ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. ఇప్పుడు కోర్టు నేరస్తులను తిరిగి జైలుకు పంపాలని ఆదేశించింది. అయితే ఈ నేరస్తులు ఇప్పుడు పరారీలో ఉన్నారట. వాళ్ళను తిరిగి జైలుకు పంపిస్తారా?

జాతీయ నేర గణాంకాల ప్రకారం మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. అత్యంత హీనమైన నేరాలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించారు. వారిపై అత్యాచారాలు జరిగి ఉంటాయని కూడా వార్తలు వచ్చాయి. ఒలింపిక్స్‌లో దేశానికి మెడల్స్ సాధించిన క్రీడాకారిణి కూడా రెజ్లింగ్ ఫెడరేషన్ అధినేత లైంగిక వేధింపులకు పాల్పడ్డారని న్యాయం కోసం ఆక్రోశించవలసిన పరిస్థితి వచ్చింది. బెనారస్ హిందూ యూనివర్శిటీలో ఒక విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమెను తుపాకితో బెదిరించి వివస్త్రను చేసి వీడియో తీశారు. ముగ్గురు నిందితుల్లో ఇద్దరికి బీజేపీ సోషల్ మీడియా సెల్‌తో సంబంధాలున్నాయని తెలిసింది. ఇవన్నీ ఇటీవలి సంఘటనలు మాత్రమే.

బిల్కిస్ బాను నేరస్తులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసిన తర్వాత వారికి విశ్వహిందూ పరిషద్ కార్యాలయంలో పూలమాలలు వేసి ఘనసత్కారం, సన్మానాలు చేసిన వార్తలు అప్పట్లో వచ్చాయి. ఈ వార్తలు ఎలాంటి కొత్త భారతదేశాన్ని ఆవిష్కరిస్తున్నాయి?

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత బిల్కిస్ బాను చెప్పిన మాటలు గమనార్హమైనవి. దేశంలో చట్టబద్ధపాలన అన్నింటికన్నా ముఖ్యమైనది కావాలి. చట్టం ముందు అందరూ సమానులుగా ఉండాలన్నదే దేవునితో నా ప్రార్థన అన్నారామె.

అబ్దుల్ వాహెద్




# బంగ్లాలో హసీనా

మరోసారి బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా ఘనవిజయం సాధించారు. అవామీలీగ్ పార్టీ మరోసారి అధికారం చేజిక్కించుకుంది. మొత్తం 300 పార్లమెంటు స్థానాలకు గాను 299 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. అవామీలీగ్ ఏకంగా 223 స్థానాలు సొంతం చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన జతియా పార్టీకి కేవలం 11 సీట్లు లభించాయి. బంగ్లాదేశ్ కల్యాణ్ పార్టీ కేవలం ఒక స్థానంలో గెలిచింది. స్వతంత్ర అభ్యర్థులు 62 స్థానాల్లో జయకేతనం ఎగరేశారు.

షేక్ హసీనా 2009 నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు వరుసగా నాలుగోసారి గెలిచారు. మొత్తంగా చూస్తే ఆమె ప్రధానికావడం ఇది ఐదోసారి. ఈ సారి ఆమె గెలవటానికి ప్రధానకారణాల్లో ఒకటి ప్రముఖ పార్టీలు ఈ ఎన్నికలను బహిష్కరించడం. మాజీ ప్రధాని ఖాలిదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీతో సహా మరో 15 పార్టీలు ఈ సారి ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ఎన్నికల్లో కేవలం 41.8 శాతం పోలింగ్ నమోదైంది.

ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లో కూడా ప్రతిపక్షాలు బాయ్ కాట్ చేశాయి. చాలా తక్కువ పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల మాదిరిగానే ఈ సారి ఎన్నికల తర్వాత కూడా అనేక ఆరోపణలు వస్తున్నాయి. భారీ ఎత్తున అవకతవకలు, అక్రమాల వార్తలు గుప్పుమన్నాయి. అధికార అవామీ లీగ్ 'ఇది ప్రజా తీర్పు'

అంటుంటే...'అంతా మోసం, దగా' అని విపక్షాలు విమర్శిస్తు న్నాయి. గతంలోను ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. మళ్ళీ ఎన్నికలు జరపాలని డిమాండ్లు వచ్చాయి. కాని షేక్ హసీనాను గద్దె దించలేకపోయారు.

ప్రధాన ప్రతిపక్షం బిఎన్పీ 1991లోను, 2001లోను రెండుసార్లు అధికారంలో ఉంది. ఈ సారి భారీ ఎత్తున రిగ్గింగ్ జరిగిందని, ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి మచ్చవంటివని విమర్శించింది. ఈ సారి ఎన్నికల్లో జనరల్ జియావుర్రహ్మాన్ కుటుంబం నుంచి ఎవ్వరు పోటీలో లేరు. బంగ్లాదేశ్ రాజకీయాల్లో రెండు కుటుంబాలే ప్రధానంగా కనిపిస్తాయి. అవి షేక్ ముజీబుర్రహ్మాన్, జనరల్ జియావుర్రహ్మాన్ కుటుంబాలు. ముజీబుర్రహ్మాన్ కుమార్తె షేక్ హసీనా. జనరల్ జియావుర్రహ్మాన్ భార్య ఖాలిదా జియా. బిఎన్పీ పార్టీకి ఈమె అధినేత. అవినీతి ఆరోపణలతో జైలులో ఉన్న ఖాలిదా జియా ఈసారి ఎన్నికల్లో పోటీ చేయలేకపోయారు. ఆమె కుమారుడు తారిక్ రహ్మాన్ లండనులో తలదాచుకున్నాడు. రాజకీయ కక్షసాధింపులతో వారిద్దరినీ శిక్షించారన్న బలమైన ఆరోపణలున్నాయి.

2041 నాటికి బంగ్లాదేశ్ అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తానని గత ఎన్నికల్లో ఆమె హామీ ఇచ్చారు. హసీనా అవలంబించిన ఆర్థిక విధానాలు బంగ్లా ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పు తీసుకొచ్చాయన్నది వాస్తవం. పేదరికం గణనీయంగా తగ్గింది. ఆహారభద్రత ఏర్పడింది. సార్వత్రిక ప్రాథమిక విద్య వంటి అంశాల్లో దేశం ముందంజలో ఉంది. అతి తక్కువ అభివృద్ధి సాధించిన దేశాల జాబితా నుంచి బంగ్లాదేశ్ తప్పుకుని వర్ధమాన దేశాల జాబితాలో చేరింది. అవినీతి నిర్మూలనలో, ఛాందసవాద మిలిటెంట్ల ఆగడాలను అదుపు చేయడంలో కఠినంగా వ్యవహ రించింది. అలాగని అంతా సవ్యంగా ఉన్నదని చెప్పడం అవాస్తవ మవుతుంది. భావప్రకటనా స్వేచ్ఛకు ఆటంకాలు, విచ్చలవిడి ఎన్కౌంటర్లు, మనుషుల్ని అదృశ్యం చేయడం వంటివి ప్రభుత్వ తీరుతెన్నుల్ని ప్రశ్నార్థకం చేశాయి. ఆమె హయాంలో అభివృద్ధి జరిగిందన్నది ఎంత నిజమో, నిరంకుశ పోకడలు పెరిగాయన్నది కూడా అంతే నిజం. మానవ హక్కులకు సంబంధించిన ఫిర్యా దులు, భావప్రకటనాస్వేచ్ఛపై దాడులు, జర్నలిస్టుల అరెస్టులు జరిగాయి.

బీఎన్పీ అధినేత ఖలీదాతోసహా ఎందరో నేతల్ని అవినీతి కేసుల్లో శిక్షలు పడేలా చేయగలిగామని చెబుతున్నా...స్వపక్షం అవినీతి విషయంలో హసీనా సర్కారు ఉదాసీనంగా ఉంటోంది. భూ కబ్జాలు, మెగా ప్రాజెక్టుల్లో స్వాహాలు, పబ్లిక్ రంగ సంస్థల్లో అవినీతి, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో విచ్చలవిడిగా రుణాల మంజూరు, ఎగవేతదార్లపై చర్యలు తీసుకోకపోవడం వగైరాలు ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తున్నాయి. మిలిటెన్సీని అణిచేస్తున్నామని చెబుతున్నా సెక్యులర్ విలువలున్న కళాకారులు, రచయితలపై దాడులు జరుగుతున్నాయి. ఏదో ఒక సాకుతో విపక్ష నేతల్ని, వారి మద్దతుదార్లను జైళ్లలోకి నెట్టి ఆ పార్టీలకు నాయకత్వమే లేకుండా చేసిన తీరు ఎన్నికల ప్రక్రియపైనే సందేహాలు రేకెత్తించింది.

ప్రధానమంత్రి షేక్ హసీనా వాజెద్ బంగ్లాదేశ్ జాతిపితగా పిలిచే షేక్ ముజిబుర్ రహ్మాన్ కుమార్తె. హసీనా 2014లో మూడోసారి ప్రధాని పదవిని చేపట్టారు. 1960లో ఆమె ఢాకా విశ్వవిద్యా లయంలో చదువుకున్నారు. ఆ కాలంలోనే హసీనా రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 1968లో ప్రముఖ శాస్త్రవేత్త ఎంఏ వాజెద్ మియాను హసీనా పెళ్లాడారు. ముజిబుర్ రహ్మాన్ 1975 ఆగస్టు 15న హత్యకు గురయ్యారు. ఆయనతోపాటు, హసీనా తల్లిని, ముగ్గురు సోదరులను పలువురు సైనికాధికారులు ఇంట్లోనే హత్య చేశారు. ఈ హత్యలు జరిగినప్పుడు షేక్ హసీనా బంగ్లాదేశ్లో లేరు. అప్పట్లో హసీనా ఆరేళ్లు ప్రవాసంలో ఉన్నారు. ఆ సమయంలోనే అవామీ లీగ్ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. 1981లో ఆమె బంగ్లాదేశ్ తిరిగివచ్చాక రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించడం ప్రారంభించారు. చాలా సార్లు గృహ నిర్బంధానికి గురయ్యారు. 1990 డిసెంబర్లో బంగ్లాదేశ్ చివరి సైనిక పాలకుడు లెఫ్టినెంట్ జనరల్ మొహమ్మద్ ఎర్షాద్ రాజీనామా చేయక తప్పలేదు. 1991లో జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా పార్టీకి మెజారిటీ లభించలేదు. ఆమె ప్రత్యర్థి ఖాలిదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఐదేళ్లకు 1996లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించటంతో హసీనా తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు.

2001 అక్టోబరులో ఎన్నికల్లో ఖాలిదా జియా నేతృత్వంలోని బీఎన్పీ, మూడు సంకీర్ణ భాగస్వామ్య పక్షాల చేతిలో అవామీ లీగ్ ఓడిపోయింది. 2004 ఆగస్టులో ఢాకాలో అవామీ లీగ్ ర్యాలీపై గ్రెనేడ్ దాడి జరిగింది. 22మంది మరణించారు. దాడి నుంచి హసీనా అదృష్టవశాత్తు బతికిబయటపడ్డారు. 2008 డిసెంబరు సార్వత్రిక ఎన్నికల్లో 300 స్థానాలకుగాను 250కి

పైగా స్థానాల్లో హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ జయకేతనం ఎగరేసింది. 2014 జనవరిలో సార్వత్రిక ఎన్నికలను బీఎన్‌పీ బహిష్కరించింది. పోటీ లేని ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించి మూడోసారి ప్రధానిగా హసీనా బాధ్యతలు స్వీకరించారు.

తూర్పు పాకిస్తాన్ ప్రజలపై పాకిస్తాన్ అకృత్యాల వివరాలు తెలిసిన వారికి షేక్ హసీనా ప్రభుత్వం 1971 నాటి యుద్ధ నేరస్థులను ఉరి తీయడం చాలా సంతోషం కలిగించవచ్చు. 44 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ అవతరణకు ముందు పాకిస్తాన్ ప్రభుత్వం తమ దేశంలో అంతర్భాగమైన అప్పటి తూర్పు పాకిస్తాన్ మీద హద్దుమీరిన అకృత్యాలకు పాల్పడిందనే ఆరోపణలున్నాయి. లక్షలాది మంది ఆ మారణకాండలో ప్రాణాలు కోల్పోయారు. ఈ అకృత్యాలను అవామీలీగ్ నాయకురాలు షేక్ హసీనా యుద్ధ నేరాలుగా పరిగణించి యుద్ధ నేరాలను విచారించడానికి బంగ్లా దేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. ఆ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తీర్పుల మేరకు ఉరి శిక్షలు అమలైనాయి. మరణ దండన విధించడంపై సహజంగానే జాతీయంగానూ అంతర్జాతీయంగాను తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. యుద్ధ నేరాల ఆరోపణలు ఎదుర్కుంటున్న వారి విచారణ సవ్యంగా జరగలేదన్న విమర్శలూ వచ్చాయి. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు మరణ దండన విధించడాన్ని ఆక్షేపించాయి. పశ్చిమ దేశాలు బంగ్లా ప్రధాని షేక్ హసీన మీద తీసుకు రావాల్సినంత ఒత్తిడి తీసుకొచ్చాయి. షేక్ హసీనా 1996లో మొట్టమొదటి సారి ప్రధాన మంత్రి అయినా యుద్ధ నేరస్థులకు శిక్ష విధించి తీరాలన్న పట్టుదల మాత్రం 2009లో రెండో సారి ప్రధాన మంత్రి అయిన తర్వాతే పెరిగింది. మరోవైపు సెక్యులర్ వాదులైన బ్లాగర్ల మీద హత్యాకాండ, విదేశీయులను హతమార్చడం కూడా జరిగిందని గుర్తించాలి.

ఖాలిదా జియా 1991లోను, 2001లోను పదిసంవత్సరాల కాలం బంగ్లదేశ్ ప్రధానిగా పనిచేశారు. బంగ్లాదేశ్ చరిత్రలో ఆమె మొదటి మహిళా ప్రధాని. ముస్లిం దేశాల్లో బెనజీర్ భుట్టో తర్వాత ప్రధానిగా పనిచేసిన రెండవ మహిళ. ఆమె భర్త జియావుర్రహ్మాన్ బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయనే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ స్థాపించాడు. 1982లో బంగ్లదేశ్ లో మిలిటరీ కుట్ర ద్వారా జనరల్ ఎర్షాద్ అధికారంలోకి వచ్చిన సంఘటన తర్వాత, ఖాలిదా జియా బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడడానికి పోరాడారు. 1990లో ఎర్షాద్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత, 1991 ఎన్నికల్లో ఆమె ప్రధాని అయ్యారు. 1996లో అవామీ లీగ్ అధికారంలోకి వచ్చింది. 2001లో మళ్ళీ ఖాలిదా జియా ప్రధాని అయ్యారు. 2006లో జరగవలసిన ఎన్నికలు రాజకీయ హింస వల్ల జరగలేదు. మళ్ళీ మిలిటరీ అధికారంలోకి వచ్చింది. ఖాలిదా జియాపై, ఇద్దరు కుమారులపై అవినీతి కేసులు పెట్టి జైలుకు పంపించారు. తర్వాత 2009 ఎన్నికల్లో అవామీలీగ్ మళ్ళీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి షేక్ హసీనా ప్రధానిగా పాలిస్తున్నారు.

బ్రిటన్, యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాలు అత్యంత తీవ్రమైన స్వరంతో ఈ ఎన్నికలను ఖండించాయి. అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రతిష్ఠ అడుగంటే పరిణామాలివి. ఓటర్లను భయపెట్టడం, బెదిరించడం, ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలు చోటు చేసుకున్నాయని, పెద్ద స్థాయిలో రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాని షేక్ హసీనా ఎలాంటి అవకతవకలు జరగలేదంటున్నారు. బంగ్లాదేశ్‌లో చాలా శాంతియుతంగా ఎన్నికలు జరిగాయని, ప్రజలు ఎంతో ఉత్సాహంతో తమ పార్టీకి ఓటేశారని ఆమె అంటున్నారు. కాని 223 స్థానాలు అవామీలీగ్ పార్టీకే లభించాయంటే ఎన్నికలు ఎంత నిష్పక్షపాతంగా జరిగాయో తెలుస్తోందని విమర్శకులు అంటున్నారు. ప్రజాస్వామిక దేశాల్లో ఇలా 96 శాతం గెలుపు ఒకే పార్టీ సాధించడం ఉండదు.

బంగ్లాదేశ్‌లో అత్యధికంగా విదేశీ పెట్టుబడులు పెడుతున్న దేశం అమెరికా. అమెరికా కూడా బంగ్లాదేశ్ ఎన్నికలపై విమర్శలు జారీ చేసింది. దక్షిణాసియాలో అత్యధికకాలం ప్రధాని పదవిలో కొనసాగిన మహిళగా షేక్ హసీనా రికార్డు సృష్టించారు. ప్రధాన ప్రత్యర్థి ఖాలిదా జియాను జైలు పాలు చేయడం, ఆమె కుమారుడు ప్రవాసంలో బతకడం, 2014 తర్వాతి నుంచి బిఎన్పీ పార్టీకి మిత్రపక్షాలైన జమాఅతె ఇస్లామీ వంటి పార్టీలను ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించడం వంటి చర్యలతో షేక్ హసీనా సాధించిన విజయాన్ని అనేకమంది వేలెత్తి చూపిస్తున్నారు. వరుసగా ఆమె ఇలాంటి ఎత్తుగడలతోనే గెలుపు సాధిస్తూ వస్తున్నారు. ఈ సారి కూడా కుట్రలు, కుతంత్రాలు, ప్రతిపక్షాలపై వేధింపులు, భారీ సంఖ్యలో అరెస్టులు, నిర్బంధాలు, హింస, రాజ్యాధికారాన్ని దుర్వినియోగం చేయడం వంటి అనేక ఆరోపణలతో పాటు అతితక్కువ సంఖ్యలో ఓటర్లు ఎన్నికల్లో పాల్గొన్నారు. 2014లో కూడా అతి తక్కువ పోలింగ్ జరిగింది. అప్పుడు గెలిచిన షేక్ హసీనా గెలుపును చాలా మంది వేలెత్తి

చూపించారు. దాదాపు సగం మంది అవామీలీగ్ సభ్యులు అప్పట్లో ఎలాంటి పోటీ లేకుండా గెలిచారు. ఇలాంటి విమర్శలు రాకుండా ఉండటానికి ఈ సారి కొంతమంది తమ వారినే స్వతంత్ర అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపించారు.

బంగ్లాదేశ్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. దేశంలోని నిరుపేద ప్రజానీకం ఈ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే అవామీలీగ్‌కు మాత్రమే ఓటు వేయాలని, లేకపోతే ప్రయోజనాలేవీ లభించని స్థితి సృష్టిస్తామని బెదిరించినట్లు కూడా తెలుస్తోంది. సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్న వారికి ఆ ప్రయోజనాలు పొందడానికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు ఆ కార్డులను స్థానిక అవామీలీగ్ నేతలు స్వాధీనం చేసుకుని తాము గెలిస్తేనే కార్డులు తిరిగి ఇస్తామని బెదిరించి మరీ ఓట్లు వేయించుకున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి.

బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా తాను బంగ్లాదేశ్ ను ఆర్థికంగా అభివృద్ధి చేశానని చెబుతున్నారు. కాని ఈ అభివృద్ధి ప్రజాస్వామ్యాన్ని పణంగా పెట్టిన అభివృద్ధిగా విమర్శకులు అంటున్నారు. ఇప్పుడు బంగ్లాదేశ్ ఆర్థికాభివృద్ధి కూడా పతనావస్థలో పడింది. విదేశీమారకద్రవ్యం 20 బిలియన్ అమెరికా డాలర్ల కన్నా తక్కువకు పడిపోయింది. వంద బిలియన్ డాలర్ల విదేశీ అప్పు ఉంది. బ్యాంకింగ్ రంగం అస్తవ్యస్తంగా మారుతోంది. నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయి. ద్రవ్యోల్బణం 9 శాతానికి పెరిగిపోయింది. బంగ్లాదేశ్ కరెన్సీ టాకా విలువ పడిపోతోంది. గత కొన్ని నెలలుగా దుస్తుల పరిశ్రమ ఎగుమతులు పడిపోయాయి. దేశంలో క్రోనీ కేపిటలిజం, అవినీతి వల్లనే దేశం ఆర్థిక సంక్షోభ దశకు చేరుకుంటుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం ముదురుతున్న కొద్ది కార్పోరేట్లు, వ్యాపార వర్గాలు మరిన్ని మినహాయింపులు, ప్రయోజనాలు కోరుతారు. ఈ సమస్యలను అధిగమించడం ఈ సారి అంత తేలిక కాదు. ఆర్థిక సంక్షోభపరిస్థితుల వల్ల ఇప్పటికే దేశంలోని మధ్య, దిగువ తరగతి ప్రజలు తీవ్రమైన సమస్యలకు గురవుతున్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం తర్వాత బంగ్లాదేశ్ పరిస్థితి మరింత దిగజారింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి 4.7 బిలియన్ డాలర్ల బెయిలవుట్ కోసం ప్రయత్నించవలసి వచ్చింది.

రష్యా, చైనా దేశాలు బంగ్లాదేశ్ ఎన్నికల్లో అనవసరంగా అమెరికా, పాశ్చాత్యదేశాలు జోక్యం చేసుకుంటున్నాయని విమర్శిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఇప్పుడు చైనాకు సన్నిహితమయ్యే సూచనలు కూడా కనిపిస్తున్నాయి. ప్రధాన ప్రత్యర్థి ఖాలిదా జియా పార్టీని నిషేధించడం జరగవచ్చని, అదే జరిగితే దేశంలో హింసాకాండ పెచ్చరిల్లవచ్చని పలువురు భావిస్తున్నారు. అవామీలీగ్ అధికారంలో ఉండడం అక్కడి వ్యాపారవర్గాలకు చాలా అవసరం. అలాగే విదేశీ పెట్టుబడిదారులకు కూడా ఆమె అధికారంలో కొనసాగడం అవసరం. బంగ్లాదేశ్ 2.6 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు కేవలం చైనా నుంచి పొందింది. జపాన్ పెట్టుబడులు కేవలం 380 డాలర్లు మాత్రమే. అవామీ లీగ్ అధికారంలో ఉండడం చైనాకు మంచిది. అందువల్లనే నిరంకుశ విధానాలతో ప్రతిపక్షాలను పూర్తిగా తుడిచేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ఒకప్పుడు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డం కోసం పోరాడిన షేక్ హసీనా ఇప్పుడు బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్యాన్ని తుడిచేసేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. బంగ్లదేశ్ ప్రజాస్వామ్యం షేక్ హసీనా హయాంలో ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. ✤


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు – హిందీ – ఇంగ్లీష్ – తమిళం – కన్నడ – మరాఠీ – బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

నమ్మినా నమ్మకపోయినా?

16

# జీవిత అంతిమస్థానం

నమ్మినా నమ్మకపోయినా మరణం జీవితపు అంతిమ గమ్యం కాదు. మంచి పనులు, చెడు పనులు ఒకటి కావు. మాతృగర్భం నుండి మనిషి ఈ ప్రపంచంలోకి వచ్చినట్లే, మరణం ద్వారా మనిషి మరో ప్రపంచంలోకి అడుగిడుతాడు.

ఈ విశ్వానికి ఇంకా మానవులకు సృష్టికర్త అయిన దేవుడు మన మరణానంతరం మన కర్మలను బట్టి మన చివరి మజిలీగా స్వర్గ నరకాలను ఏర్పరిచాడు. ఇక ఆపై మూడో గమ్యస్థానమే లేదు.

స్వర్గం శాశ్వతంగా వుండే ఓ శాంతి నెలవు. అలాగే నరకం శాశ్వత కష్టాలకు యాతనలకు నిలయం. తమ గమ్యస్థానం ఎంచుకోవటానికి దేవుడు మానవులకు పూర్తి స్వేచ్ఛను ప్రసాదించాడు. తమకు నచ్చిన గమ్యస్థానాన్ని చేరుకోవడానికి మానవులు ఈ ప్రపంచంలో పాటుపడుతూ వుంటారు.

నరకాన్ని ఎంచుకున్నవారు దేవుణ్ణి విశ్వసించరు. వారు తమ ఆలోచనలకు, పనులకు తామే స్వాములు. తాము కోరుకున్న విధంగా ప్రవర్తిస్తుంటారు. సాటి మానవులను ఏమాత్రం లెక్కచేయరు, వారి హక్కుల్ని కొల్లగొడతారు, నిత్యం ఇతరులతో ఘర్షణలకు దిగుతారు. దురభిమానం, సంకుచితత్వం, అసూయా ద్వేషాలను పెంచిపోషిస్తూ దోపిడి దౌర్జన్యాలు చేస్తుంటారు. పొరుగు వారిని పురుగులకన్నా హీనంగా చూస్తుంటారు. తమ ప్రవర్తన వల్ల సమాజంలో శాంతికి, న్యాయానికి విఘాతం కలిగిస్తారు. వారి ఈ చెడు చేష్టలకు, విధ్వంసానికి కారణం వారు ఈ ప్రపంచానికి ఓ సృష్టికర్త ఉన్నాడన్న విషయాన్ని త్రోసిపుచ్చడం, ఇంకా మరణానంతరం దేవునికి సమాధానం చెప్పుకోవాలన్న “జవాబుదారి” భావన వారిలో లేకపోవడమే. వారి చెడు కర్మలకు, చేష్టలకు తగిన విధంగానే సృష్టికర్త వారికి నరకాన్ని సిద్ధం చేసి వుంచాడు.

స్వర్గం లేక నరకం అనే గమ్యస్థానాల పట్ల విశ్వాసం లేని వ్యక్తి కూడా చివరికి నరకానికే చేరుకుంటాడు. ఎందుకంటే అతను ఈ పరిణామాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించాడు. దీనిపట్ల ఎలాంటి ఆలోచనకు తావివ్వకుండా తన బుర్రలో పుట్టిన ఆలోచనలతో జీవితాన్ని అంతం చేసుకున్నాడు.

ఇక స్వర్గానికి చేరుకోదలిచినవారు సృష్టికర్త పట్ల సంపూర్ణ విశ్వాసం కలిగివుండాలి. తమకు తాము దేవునికి స్వయం సమర్పణ చేసుకోవాలి. చిట్టచివరి దేవుని ప్రవక్త (స) ఇంకా అంతిమ గ్రంథం ద్వారా తమకు అందిన ఆజ్ఞలు, విధి విధానాల ప్రకారం తమ జీవితాలను కొనసాగించాలి. సాటి మనుషుల హక్కులను వారి సంతృప్తి మేరకు నెరవేర్చాలి. దీనిద్వారా వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఇంకా సమాజపరంగా కూడా శాంతి సుహృద్భావాలు వెల్లివిరుస్తాయి.

స్వర్గానికి చేరుకోవటం అంత సులభం కాదు. దీనిగ్గాను మానవుడు ఎన్నో ఆటుపోట్లను, ఆటంకాలను ఎదుర్కోవాలి. మరీ ముఖ్యంగా నరకానికి చేరుకునే మానవుల ద్వారా సృష్టించబడ్డ విఘాతాలను, అడ్డంకులను అధిగమించాలి. నీతి నియమాలకు కట్టుబడి గౌరవ మర్యాదలతో సమాజంలో న్యాయాన్ని, శాంతిని నెలకొల్పాలి. దీనిగ్గాను జీవిత రంగాలన్నింటిలో తన జీవితాన్నే త్యాగం చేయాల్సివుంటుంది. మానవులందరి కొరకు పంపబడిన దైవాజ్ఞల పాలనలో ఎంతో ఓర్పు, సంయమనం కావాలి.

ఇలాంటి ఉన్నత విలువలతో, హుందాతనంతో సాటి మానవుల పట్ల మానవతా దృక్పథంతో మసలుకున్న శుభకర వ్యక్తులే తమ చివరి గమ్యంగా స్వర్గాన్ని చేరుకోవటంలో విజేతలుగా నిలుస్తారు.

మన కంటికి కన్పించని పైన తెలిపిన స్వర్గ నరకాల గమ్యస్థానాలు మనల్ని గంభీరంగా, తార్కికంగా ఆలోచించమని సవాలు విసురుతున్నాయి.

అవును, నమ్మినా నమ్మకపోయినా ప్రతివారికీ ఇదో పెద్ద సవాలే!

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

అధ్యాయం -4

13

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

### 3. అశ్లీల వ్యవహర్తనిల పట్ల...

మొదటి ఖలీఫా కాలంలో మరో ఉపద్రవం తలెత్తింది. ప్రవక్త శ్రీ(స) పరమదించిన మీదట దౌర్భాగ్య వతులయిన, యమన్ లోని యూదు స్త్రీలు, కొందరు హజర మౌత్‌లోని స్త్రీలు, దైవప్రవక్త దివంగతులయినందుకు వేడుకలు జరుపుకున్నారు. ఆ సందర్భంలో వారు భిన్న విధాల పాప కార్యాలకు, ఆట పాటలకు నిర్లజ్జ చేష్టలకు, అర్థ నగ్న నృత్యాలకు, శృంగార కేళికి పూర్తిగా స్వేచ్ఛ నిచ్చారు. రేయనక పగలనక బజారు లనక వీధులనక ఇదంతా నిత్యకృత్యమయి పోయింది.

ఇదంతా అక్కడి ప్రజలకు ఇస్లామ్‌కు పూర్వపు దినసరి చర్యలే. ఇస్లామ్ వచ్చిన తరువాత వీటి నన్నింటిని నిషేధించి వాతావర ణాన్ని పరిశుద్ధపరచడం జరిగింది. ఇంకా అపరిచిత స్త్రీ పురు షులు ఓ చోట కలసుకోవడాన్ని, ఒకరినొకరు చూపులు కలపడాన్నీ నిషేధించింది. అదొక్కటే దౌష్ట్యాలన్నింటి ద్వారాలు మూసివేసేది. ప్రవక్త శ్రీ (స) దివంగతులయిన సమాచారం అందగానే ఆ సమాజంలో మిగిలి ఉన్న దుర్జనులకు స్వేచ్ఛ లభించి నట్లయింది. ఆ స్త్రీలలో అత్యధికంగా శ్రీమంతు లయిన వారే మున్ముందు ఉన్నారు.

వీరిలోని 'యూదు అరబ్బు ధనవంతుల అనేక స్వప్రయోజ నాలూ ఆ పైశాచిక సభ్యతలో మిళితమయి ఉన్నాయి. వారి దుష్ట కాంక్షల పరిపూర్తి తోపాటు ఇస్లామీయ ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక వ్యవస్థను విధ్వంసం చెయ్యడం కూడా వారి ఉద్దేశం! దీన్ని అర్థం చేసుకోలేని సాధారణ జనం, 'ఇది స్త్రీ స్వేచ్ఛ లోని అంతర్భాగం' అన్న నినాదానికి మోసపోతారు!

షైతాన్ శిష్యులు వీరికి తోడయ్యారు. ఈ కార్యకలాపాలవల్ల ఆ ప్రాంతాల్లో నివసించే ముస్లిమ్ జనులు మార్గం తప్పే ప్రమాదాలు అధికమయ్యాయి. చరిత్రలో ఈ ఉద్యమాన్ని "హర్కతుల్ బగాయ" (నైతిక ప్రమాణాలపై తిరుగుబాటు చేసిన స్త్రీల ఉద్యమం) అని పేర్కొనడం జరిగింది. వారు దాదాపు ముప్పై మంది దుర్నడత గల స్త్రీలు. ఖలీఫా అబూ బక్ర్(ర) కు సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలోని తన గవర్నర్ ముహాజిర్ బిన్ అబీ ఉమయ్యకు లేఖ పంపారు, నీకు ఈ లేఖ అందగానే నీ వద్ద ఉన్న దళాన్ని తీసుకుని ఆ స్త్రీల వద్దకు వెళ్లి వారికి హస్త ఖండన శిక్ష విధించాలి. ఎవరయినా ఎదిరిస్తే వారిని వారించి, ఈ చర్యను ప్రతిఘటించడం ఇస్లామ్ విరోధంగా పరిగణించ బడుతుందని హెచ్చరించాలి. అవసరమయితే వారితో పోరాడవలసి వస్తే అదీ చేయాలి.

గవర్నర్ మహనీయ ముహాజిర్ బిన్ అబీ ఉమయ్య లేఖ చూడగానే సైనిక దళం తీసుకుని బయలు దేరారు.

మధ్యలో కొందరు ప్రతిఘటించారు. ఆయన వారికి అసలు విషయం బోధపరచడానికి యత్నించారు. కాని వారిలో

కొందరు అర్థం చేసుకున్నా అధికంగా తలపడటానికే ఉద్యుక్తులయ్యారు. ఆ ఇస్లామ్ విరోధుల్ని, ఇతరులకు గుణపాఠం కలిగేలా శిక్షించారు. వారి చెడు నడత గల స్త్రీలకు షరీఅత్ ప్రకారం శిక్ష విధించబడింది.

ఒకసారి మహనీయ అబూబక్ర్ (ర) సతీమణి ఏదయినా తీపిపదార్థం తయారు చేసుకునే ఉద్దేశం వెలిబుచ్చారు. దానికి ఖలీఫా, "మన వద్ద దానికి కావలసిన స్థోమత లేద"ని చెప్పారు. ఆమె, "సరే, నేను దినసరి ఖర్చుల్లోనే కొంత మిగిల్చుకుని కూడబెట్టుకుంటాను" అని చెప్పారు. "అవును, అలా చేసుకో" అన్నారాయన.

ఒకప్పుడు మహనీయ అబూ బక్ర్ (ర) వ్యాపారం చేసి బాగా గడించిన వ్యక్తి. ఆయన కుటుంబం సంపన్న కుటుంబం. ఇప్పుడు ఖలీఫా అవడం చేత వ్యాపారం చేయలేరు, ఇంట్లో బీదరికం తాండవిస్తోంది. ఆయన బైతుల్ మాల్ నుంచి తన ఇంటి ఖర్చుల మేరకే తీసుకునేవారు.

కొన్ని రోజుల తరువాత ఖలీఫా సతీమణి తన ఇంటి ఖర్చుల నుండి ఆదా చేసిన సొమ్ముతోనయినా తీపిపదార్థం తయారు చేయాలనుకుంటే, ఆ విషయం తెలుసుకున్న ఖలీఫా ఆ డబ్బు కూడా తీసుకుని బైతుల్ మాల్‌లో జమ చేశారు. పైగా బైతుల్ మాల్ అధికారిని ఆదేశించారు, ఇకపై తనకు లభించే నెలసరి వేతనంలో ఆ మేరకు తగ్గించాలనీను!

యమామ పోరులో అమరగతులయిన ముస్లిముల్లో చాలా మంది దివ్య కుర్‌ఆన్ స్మర్తలు ఉండేవారు. ఈ కారణంగా మహనీయ ఉమర్ ఫారూక్ (ర) సలహా మేరకు ఖలీఫా అబూ బక్ర్ (ర) దివ్య కుర్‌ఆన్‌ని లిఖిత పూర్వకంగా ఓ చోట సంకలనం చేయాలని సంకల్పించారు. అప్పటి వరకు కుర్‌ఆన్ భాగాలు చర్మం ముక్కల మీద, ఎముకల మీద, ఖర్జూరపు మట్టల మీద వ్రాయబడి ఉండేవి. ఆ కుర్‌ఆన్‌ని, స్మర్తలయిన సహచర మాన్యుల ఆంతర్యాలలో సురక్షిత మయిన కుర్‌ఆన్‌ని ఒక చోట లిఖిత పూర్వకంగా భద్ర పరచడం అవసరమని సలహా ఇచ్చారు మహనీయ ఉమర్ (ర).

ఖలీఫా మహనీయ అబూ బక్ర్, ఈ మహత్తర ధార్మిక, చారిత్రక, బాధ్యతాయుత కార్యభారాన్ని మహనీయ జైద్ బిన్ సాబిత్ (ర)కు అప్పజెప్పారు. ఈ గాథను మహనీయ జైద్ ఈ విధంగా ఉల్లేఖించారు. యమామ పోరాటం తరువాత మహనీయ అబూ బక్ర్ నన్ను పిలిపించారు, నేను వెళ్ళేటప్పటికి అక్కడ మహనీయ ఉమర్ ఫారూక్ కూడా ఉన్నారు. ఖలీఫా ఇలా చెప్పారు,

"నా వద్దకు ఉమర్ వచ్చారు, ఆయన అనేదేమిటంటే యమామ పోరులో అనేక మంది కుర్‌ఆన్ స్మర్తలు అమరగతులయ్యారు. ఇలాగే రాబోయే కాలంలో రణరంగంలో వారిలో కుర్‌ఆన్ స్మర్తలు, పారాయణకర్తలు అమరగతులవుతూ ఉంటే దివ్య కుర్‌ఆన్ అధిక భాగం వారితోనే మన చెయ్యి దాటి పోతుంది. ఆయన అభిప్రాయంలో కుర్‌ఆన్‌ని ఓ చోట క్రోడీకరించటం అవసరం, అందువల్ల కుర్‌ఆన్‌ని ఓ చోట చేర్చి సంకలనం చేసేందుకు ఆదేశమివ్వమని ఆయన కోరుతున్నారు". దానికి నేను "దైవ సందేశహరులు చెయ్యని పని నేనెలా చెయ్యగలను అని అంటున్నాను."

అప్పుడు మహనీయ ఉమర్ ఇలా కలగజేసుకున్నారు, "దైవం మీద ఒట్టు! ఇది ఎంతో ఉత్తమమయిన కార్యం," ఆ పైన ఉమర్ (ర) నాతోనే నిరంతరం మాటలాడుతూ నన్ను ఆ కార్యానికి సమాయత్తం చేయసాగారు. కడకు దైవం నా ఆంతర్యాన్ని ఆ మహత్తర కార్యం కొరకు విప్పారజేశాడు.

తరువాత ఖలీఫా అబూ బక్ర్ (ర), మహనీయ జైద్‌ని సంబోధించి, "నిశ్చయంగా మీరు యువకులు, బుద్ధి మంతులు. మేము మిమ్మల్ని ఏవిధంగానూ నిందించము. మీరు ప్రవక్త శ్రీ కాలంలోనూ వహీని వ్రాసేవారు. కనుక విభిన్న చోట్ల నున్న దివ్య కుర్‌ఆన్ భాగాలను ఏకత్రం చేయండి" అన్నారు.


మహనీయ జైద్ తన భావాలను ఇలా వ్యక్తపరిచారు. "దైవం మీద ఒట్టు! మహనీయ అబూ బక్ర్, నన్ను కొండను కదిలించమన్నా అది నాకు కుర్‌ఆన్‌ని క్రోడీకరించటం కన్నా కష్టతరం కాకపోయేది.

నేను కుర్‌ఆన్‌ని ఖర్జూరపు మట్టల నుంచి, బండ పలకల నుంచి, తోలుముక్కల నుంచి, ఒంటెల భుజపుటెముకల నుంచి వెతికి వెతికి, ముస్లిముల హృదయాల నుంచి సేకరించి, ప్రోగు చేసి వ్రాయడం మొదలెట్టాను. ఎంతో వెదికిన తరువాత 'తౌబా' సూరా చివరి భాగం మహనీయ అబూ ఖుజైమా అన్సారీ వద్ద లభించింది అన్నారు. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# 'సామాజిక రుగ్మతలపై సమరం.. సమద్ ఇస్లాంవాద కథలు

## షేక్ కరీముల్లా, ఇస్లాంవాద కవి




**ప్రాచీన సాహిత్యం** నుండి నేటి ఆధునిక సాహిత్యం వరకు కథకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంది. మనిషి జీవితంలోని ప్రతి సంఘర్షణ ఒక కథే! సమాజ సమస్యలు పరిష్కారానికి సంబంధించి భిన్న పార్శ్వాలు ఉండవచ్చు. అయితే రచయిత సమస్యకు తాత్కాలిక పరిష్కారం ఆలోచిస్తున్నాడు లేక సమస్య మూలాలు తొలిచి పరిష్కారం చెప్తున్నాడా అన్నది ప్రధానం. తనదైన ఫలశ్రతిని అందివ్వడం సైద్ధాంతిక నిబద్ధత ఉన్న రచయితకు మాత్రమే సాధ్యమౌతుంది. ఈ దృష్టి కోణం నుండి చూస్తే నంద్యాలకు చెందిన షేక్ అబ్దుల్ సమద్ భాయ్ రాసిన ఈ కథలు సఫలతను సాధించాయి. ది.1-7-1958 సం. అమినాబీ, అబ్దుల్ షుకూర్ దంపతులకు జన్మించిన సమద్ భాయ్ బి యస్ ఎన్ యల్ జేయిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. పలు సామాజిక, సేవా కార్యక్రమాలలో పాల్గొంటూనే కథలు, కవిత్వం, అబాబీలు విస్తృతంగా రాస్తున్నారు. జీవితంలో తను నమ్మిన ఇస్లామీయా విలువలను త్రికరణశుద్ధిగా ఆచరించే కార్యశీలి. ఇప్పుడే ఇస్లాం వాద కథల పుస్తకం "అంతర్వేదన"తో మన ముందుకు వచ్చారు. మనిషి జీవితంలోని చీకటిని దృశ్య భాషలోకి అనువదించిన కథలివి. ప్రతి కథలోనూ పాత్రల చిత్రణ,సంభాషణ, దిశానిర్దేశం చేసే ముగింపు రచయిత విశిష్టతను తెలియజేస్తాయి. ఈ పుస్తకంలో కథకుడు అంతరార్థ కథనంతో ముందుకు సాగుతూ పాత్రలు ప్రతీకాత్మకంగానూ, సందేశ భరితంగానూ ఉంటాయి. ప్రతి కథలోను మౌఖిక సంభాషణలు సంక్లిష్ట వాక్యాలు గాను, సంయుక్త వాక్యాలు గాను సంభాషిస్తూ ఆలోచింపజేస్తాయి. అనేక సున్నితమైన విషయాల్ని, సంక్లిష్టమైన విషయాల్ని విశద పరుస్తూ కథనం సాగుతూ ఉంటుంది. సమద్ భాయ్ రాసిన ప్రతి కథ మనిషిని అంతర్లోకానికి తీసుకెళ్లి ఆత్మపరిశీలన వైపుకు, ఆత్మ ప్రక్షాళన వైపునకు నడిపిస్తాయి.

.... ప్రపంచకరణ సామాజిక శ్రేయస్సును గాక వ్యక్తి శ్రేయో వాదాన్ని విస్తరింపజేసింది. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు క్షీణించాయి. తల్లిదండ్రులు తమ ఇంట్లోనే తాము శరణార్థుల్లా బిక్కు బిక్కు మంటూ బతికే పరిస్థితి వచ్చింది. తన బిడ్డ భార్యలోలుడైనా తల్లి మనసు తనయుడి మేలుకై తపిస్తూనే ఉంటుంది. దీనిని తన 'అమ్మ మనసు' అనే కథలో సమద్ భాయ్ ఎంతో హృద్యంగా చిత్రీకరించారు. ఇస్లాం వరకట్నాన్ని నిషేధించింది. పురుషుడే తనకు కాబోయే భార్యకు మెహర్ చెల్లించి ఆర్థిక భద్రత కల్పించాలని నిర్దేశించింది. కానీ సమాజం ఇంకా ఇస్లామీయ విలువలకు ఒంట పట్టించుకోని కారణంగా వరకట్నాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానూ తీసుకుంటున్న వారు అనేకులు ఉన్నారు. దహేజ్ (కానుకలు) కోసం వెంపర్లాడే వారు ఉన్న కాలం ఇది. దీనిపై వ్యంగాత్మకంగా కథనంతో 'వరకట్న వలయాలు' అనే కథ సాగుతుంది. సమద్ భాయ్ కథల్లోని ఇతివృత్తాల ఎంపిక ప్రత్యేక మైనవి. సమాజంలోని అంతర్ సంఘర్షణల్ని గమనిస్తూనే పాత్రల ప్రవర్తన మనోవరణాన్ని ఆక్రమిస్తాయి. తెలుగు సాహిత్యంలో ఇస్లామోఫోబియా పెంచి పోషించబడింది. దీనికి సంస్కరణ అనే ముసుగు తొడుక్కొని ముస్లింల జీవనంపై సాంస్కృతిక విషయాలపై పెద్దపట్టున దాడి చేశారు. యూరోప్ సాంస్కృతిక

సామ్రాజ్యవాదం సాగించిన ప్రచారాలకు లొంగి పోయిన రచయితలు అనేకమంది ఉన్నారు. కానీ సమద్ భాయ్ అలా కాదు. దేశంలో ప్రస్తుతం హిజాబ్ గురించి పెద్ద చర్చే నడుస్తుంది. హిజాబ్ ధరించే తమ స్వేచ్ఛ కోసం అటు ముస్లిం మహిళలు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ కుట్రలన్నీ సమద్ భాయ్ కలానికి తెల్సు. అందుకే నిటారుగా నిలబడి ఇస్లామీయ సాంస్కృతిక విలువల పరిరక్షణకై కంకణం కట్టుకుని నంద్యాల నడివీధులో నిలబడి సాంస్కృతిక సామ్రాజ్య వాదుల కుట్రలను విఫలం చేసింది. ఈ పుస్తకంలో 'గమ్యం చూపిన ప్రయాణం' అనే కథ హిజాబ్ ప్రాశస్త్యాన్ని సంభాషణ రూపంలో పాత్రల చేత చెప్పిస్తూ చాతుర్యాన్ని ప్రదర్శించింది. అనేక కథల్లో పాత్రలు జమాఅత్ కున్న ప్రాధాన్యత, నేర్పిన క్రమశిక్షణ, సేవా గుణాన్ని చెప్తూ సమాజానికి, ఈ దేశానికి జమాఅత్ వల్ల కలుగుతున్న మేలుని చెప్తుంటాయి. తండ్రి స్వర్గానికి ఒక ద్వారం వంటి వాడు అని దైవ ప్రవక్త మహమ్మద్(స) చెప్పారు.

...'నాన్న ది గ్రేట్' అనే కథ నాన్న ప్రాధాన్యతను, ప్రేమను, బిడ్డల్ని తీర్చిదిద్దడంలో నాన్న పడే శ్రమలు చెప్తుంది. మనిషి అబద్ధమనే నైజన్ని అలవరచుకుంటూ నిజాన్ని విషంలా భావిస్తున్న ఈ కాలంలో ఓ ముస్లిం తన పవిత్ర గ్రంథం పై ప్రమాణం చేస్తూ నిజమే చెప్పడం కోర్టు జడ్జిని సైతం దిగ్భ్రాంతి పరుస్తుంది. అబద్ధం కన్నా నిజం ఎంతో సద్వర్తనో 'విశ్వాస నజరానా' అనే కథ చెప్తుంది. సమద్ భాయ్ ప్రతి కథ తన వస్తువుతో అబ్బురపరుస్తూ కల్పానికత స్థానంలో వాస్తవికతకు అద్దం పడుతుంది.

మతతత్వ ఫాసిజం పెనుప్రమాదంగా మారి ముస్లింల జీవనాన్ని సంక్లిష్టం చేసింది. మీడియా సైతం తన ప్రజాస్వామ్య, సెక్యులర్ విలువలు కోల్పోయి ముస్లింలను ఉగ్రవాదులుగా, ఉన్మాదులుగా, మతఛాందస వాదులుగా చిత్రీకరిస్తూ ఇస్లామో ఫోబియాను, ముస్లిం ఫోబియాను కుట్రపూరితంగా పెంచి పోషించింది. ఫలితంగా ముస్లింల సంస్కృతికి చిహ్నాలైన టోపీ, గడ్డం, పర్దా, లాల్చి పైజామాలు ఆకారణ అవమానాలకు వేధింపులకు గురవుతున్నాయి. సమద్ భాయ్ తన 'నిరపరాధి' అనే కథలో ఒక అమాయకుడైన యువ కుడు కేవలం తన వస్త్రధారణ వల్ల అక్కడి ఒక పేలుడు సంఘటనలో ఎలా ఉగ్రవాదిగా ముద్ర వేయబడ్డాడో రచయిత చాలా బలంగా చెప్పారు. మీడియా సైతం చిలువలు పలువలుగా తప్పుడు కథనాలు వండి వారిస్తూ ఎలా ముస్లింల జీవితాలు ఛిద్రం చేస్తుందో ఈ కథ సందర్భానుసారంగా చెప్తుంది. ప్రతి కథలోనూ అంతర్వేదన కొట్టుమిట్టాడుతూ వాచ్యం కళాత్మకంగా వ్యక్తంమవుతుంది. సమాజంలో అనేక వైరుధ్యాలను తాత్విక దృష్టితో రచయిత చూస్తారు. మరీ ముఖ్యంగా ముస్లింల జీవన సరళి ఈ కథల ద్వారా రికార్డు అవుతాయి. ఇస్లామీయా సంస్కృతి పరిమళాలు వెదజల్లుతూ నడిచే కథలివి. ప్రేమ పేరుతో విచ్చల విడి సంస్కృతిని ఖండిస్తూ గౌరవప్రదమైన, శ్రేయోదాయమైన విధానాలకు ఇస్లాం వెలుగులో ప్రతిపాదిస్తుందీ పుస్తకం. ఈ కథల్లో జకాత్ ప్రాధాన్యత గురించి వితంతు వివాహాల అవసరం గురించి విద్య దొల్లతనం గురించి చైతన్యం చేసే ప్రగతిశీల భావాలున్నాయి.

...నానాటికి విద్యావంతుల్లో పెరిగిపోతున్న 'అమ్మాయి ఫోబియా' చర్చించబడింది. శరీరం వైకల్యం వైకల్యమే కాదు మనో వైకల్యమే అసలు వైకల్యమని కష్టాల కొలిమిలో కాగుతున్న ఆడపిల్లలకు గట్టి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించాయీ కథలు.

తెలుగు సాహిత్యంలో ఇస్లాం వాద సాహితోద్యమం బలంగా కొనసాగుతున్న కాలం ఇది. అనేకమంది కవులు, రచయితలు తమదైన శైలిలో 'ఇస్లాం' ను తమ సైద్ధాంతిక, తాత్విక భూమికగా విశ్వసించి కలాలను కదం తొక్కిస్తున్న సమయం ఇది. ఈ సాహితి సమరంలో సమద్ భాయ్ ఓ ఇస్లాం వాద సాహిత్య యోధునిగా ఈ పుస్తకంతో మన ముందుకొచ్చారు. ఇందులోని ప్రతి కథ ప్రగతిశీల, ప్రజాస్వామిక ప్రయోజనాత్మక విలువలు కలిగి సమాజ చైతన్యానికి బాట వేస్తుంది. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ఇవి కథలు కాదు మనుషుల జీవితాలు. మానవ ప్రగతికి వికాసానికి ఊపిరిలూదే అత్యున్నత ఆశయాలు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు చదివి తీరాల్సిన కథలివి. సమద్ భాయ్! ఆగేబడో.. సరిహద్దు కంచెల్ని తెచ్చుకుంటూ, తెగిపడ్డ తంత్రుల్ని కలుపుకుంటూ, ముస్లిం అంటూంటే విశ్వ ప్రేమికుడని చాటుకుంటూ సాగే మీ కలం అజరామరంగా నిలవాలని కోరుకుంటూ...

★★★

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**కాలం సాక్షి! మానవుడు ఘోరంగా నష్టపోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేస్తూ, సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించుకునేవారు మటుకు ఏమాతం నష్టపోరు. (అస్ర్: 1-3)**

క్షణాలు, నిమిషాలు, గంటలు, పూటలు, దినాలు, వారాలు, నెలలు, సంవత్సరాలు, శతాబ్దులు, సహస్రాబ్దులు.... యుగాలు, కల్పాలు- ఇలా కాలం అనేక రూపాల్లో కనిపిస్తుంది. కాలం పరిణామశీలం. ఒక్కమాటలో చెప్పాలంటే అన్ని పుట్టుకలకు, అన్ని బతుకులకు, అన్ని ప్రశయాలకు కాలమే సమాధానం. కాలమే మూలం.

## మనిషి మహా ఆత్రగాడు

మనిషి కాలం కలిసి వచ్చినప్పుడు, లాభం కలిగినప్పుడు మంచి కాలమనీ, కష్టం వచ్చినప్పుడు చెడు కాలం అని, కాలాన్ని నిర్వచిస్తూ ఉంటాడు. ఇది అతని నైజం! ఎవరు ఏమనుకున్నా, కాలం తన పని తాను చేసుకొంటూపోతూనే ఉంటుంది.

మానవునికి మేమేదైనా అనుగ్రహిస్తే అతను మాకు విముఖుడయి పోతాడు. పైగా అహంకారంతో విర్రవీగుతాడు. కాని అదే కష్టమొచ్చినప్పుడు సుదీర్ఘ ప్రార్థనలు చేస్తాడు. (హామీమ్ అస్సజ్దహ్ : 51)

మానవుడు తొందరపడేవాడుగా సృజించబడ్డాడు. ఏదైనా కాస్త ఆపద వస్తే చాలు, కంగారుపడిపోతాడు. సంపద ఒనగూడి నప్పుడు పిసినారితనం వహిస్తాడు. (అల్-మారిజ్: 19-21)

మానవుడ్ని అతని ప్రభువు పరీక్షించే నిమిత్తం గౌరవం, ఇతర భాగ్యాలు ప్రసాదించినప్పుడు అతను (పొంగిపోయి) "నా ప్రభువు నన్ను గౌరవనీయుడిగా చేశాడు" అంటాడు. (మరో విధమైన) పరీక్ష నిమిత్తం లేమికి గురిచేసినప్పుడు అతను (నిరాశతో క్రుంగిపోయి) "నా ప్రభువు నన్ను అవమానం పాల్జేశాడు" అంటాడు. (మానవుడు గౌరవ ప్రతిష్ఠలకు సిరిసంపదలే కొలమానం అనుకుంటున్నాడు). ఎంతమాత్రం కాదు. (ఫజ్ర్: 15-17)

మానవుడు (ముందుచూపు లేకుండా) మేలుకు బదులు కీడు కోరు కుంటున్నాడు. అతను నిజంగా చాలా తొందరపాటు కలవాడు. (బనీ ఇస్రాయీల్: 11)

## యదార్థం ఏమిటంటే...

(సత్యాసత్యాల సమరంలో) మీరేకాదు, వారు కూడా దెబ్బతిన్నారు. (ఆ మాత్రానికే ధైర్యం కోల్పోవడమా!) ఇవన్నీ మేము ప్రజల మధ్య తిప్పే కాలపు మిట్టపల్లాలు మాత్రమే. ఆయన మీలో నిజమైన విశ్వాసులెవరో పరీక్షించడానికి, కొందరిని సత్యానికి సాక్షులు (అమరగతులు)గా చేయడానికి ఈ విధంగా చేశాడు. అల్లాహ్ దుర్మార్గుల్ని ఎన్నటికీ ప్రేమించడు. ఆయన ఇలాంటి పరీక్ష ద్వారా నిజమైన విశ్వాసులు ఎవరో ఏరివేసి, అవిశ్వాసుల్ని అణచి వేయదలిచాడు. (ఆలె ఇమ్రాన్: 140, 141)

## అమూల్య వరాలు అమ్మానాన్నలు

మనం కోరుకున్నప్పుడు పౌర్ణమి రాదు. ఇష్టపడినప్పుడు వసంతం రాదు. చూడాలనుకున్నప్పుడు ఇంద్రధనుస్సు కనిపించదు. ఆశించినప్పుడు ఆత్మీయులు మనకు దొరకరు. తల్లిదండ్రుల జీవితం పిల్లల జననంతోనే అంతమైపోతుంది. ఆపైన వాళ్లకంటూ ఒక జీవితం ఉండదు. పిల్లల జీవితమే వాళ్ల జీవితం. పిల్లల కోసమే కష్టపడతారు. పిల్లల కోసమే సంపాదిస్తారు. పిల్లల కడుపు నిండితే తమ కడుపు నిండిందని భావించి తృప్తిగా బతుకుతారు. పిల్లల్లో కొందరికి అది అలుసవుతుంది. చిన్నప్పటి నుంచి చనువిచ్చి ఉంటారు కనుక కొందరు పిల్లలకు చిన్నచూపు ఏర్పడు తుంది. ఎన్నోసార్లు నిస్సహాయంగా ఆధారపడుతారు కదా... అందుకని కొందరు పిల్లలకు అహంకారం వస్తుంది. అందువల్ల తల్లిదండ్రులను అలక్ష్యం చేస్తారు. నిర్లక్ష్యం వహిస్తారు. కాలికి చేతికి అడ్డం అని భావించి ఏ వృద్ధాశ్రమంలోనో వదిలిపెడతారు. మరికొందరు దయ తలిచి దారి ఖర్చులు కలిసొస్తాయని ఏకంగా వల్లకాటిలోనే వదిలిపెడతారు. ధర్మాత్ముని కంట కన్నీరొలికిన చోట క్షామం పుడుతుందట. కాదు - తల్లిదండ్రుల కంట కన్నీరు ఒలికిన చోట కాటకం పుడుతుంది. కరువు కబళిస్తుంది. అశాంతి చెలరేగి జాతినే ముంచెత్తుతుంది. ఇది తెలుసుకునేది ఎంతమంది. గంటల తరబడి చాటింగ్లో.. డేటింగ్లో.. ప్లబ్బుల్లో .. క్లబ్బుల్లో.. టిక్ టాక్ మొదలయిన సామాజిక మాధ్యమాలలో గడిపే నేటి తరంలో - అమ్మా... అన్నం తిన్నావా అని రోజుకు ఒకసారైనా ప్రేమగా పలకరించే సంతానం ఎంతమంది? నాన్నా... నీ ఆరోగ్యం ఎలా ఉంది అని పరామర్శించే పుత్రోత్తములు ఎంత మంది?

నేటి తరం వైఖరి ఎలా ఉందంటే, ఇప్పుడు మాకూ రెక్కలొ చ్చాయి... భర్తలు/భార్యలు వచ్చారు.... పిల్లలు పుట్టారు... మా గొడవ మేం చూసుకోవడానికే సమయం సరిపోవట్లేదు... ఇంక ఈ ముసలి బతుకులతో ఎలా వేగేది? అని తడబడకుండానే అనేస్తుండటం మనం గమనిస్తాం. ఇలా అనే సంతానానికి ఎన్ని బెత్తం దెబ్బలు కొట్టాలి? పక్కిల్లే అత్తవారిల్లు. పక్కింట్లో ఉంటూనే - పదిహేను రోజులు - భార్య మరణించి ఏ దిక్కూ లేని నాన్నకు పట్టెడన్నం పెట్ట బుద్ధి కలగని పాడుబుద్ధి సంతానానికి వారి మరణానంతరం ఏడ్చే హక్కుంటుందా? ప్రపంచాన్నే తృణప్రాయంగా భావించి పిల్లలకు బంగారు భవిష్యత్తుని ఇచ్చే అమ్మానాన్న ఎక్కడ? నెలకి ఇంతని విసిరేసి ప్రపంచాన్నే తల్లి దండ్రులకు ధారబోశాము అని విర్రవీగే వికృత సంతానమెక్కడ?

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోని జెదలు పుట్టవా? గిట్టవా?
అని పెద్దలన్న మాట ఎంత నిజం!

## నిరాశ కూడదు

ఇక జీవితం ఆనందమయంగా గడిచేది మనం కోరుకున్నది పొందినప్పుడు కాదు. వచ్చినవి, పొందినవి ఆస్వాదించినప్పుడే జీవితం సంతోషంగా సాగుతుంది. అలాగే చేతికందిన ప్రతీ అవకాశాన్ని ఉపయోగించుకున్నప్పుడే కోరుకున్న గమ్యానికి చేరువ వుతాం. అవకాశాలు తమంతటతాముగా మన చెంత రావు. వాటి కోసం అన్వేషించాలి. తపించాలి. శ్రమించాలి. అందిన అవకాశా లను దొరకబుచ్చుకుని కార్యనిర్వహణలో విజయం సాధించాలి.

అవకాశాలు కలిసి రావడానికి అదృష్టం ఉండాలని కొందరి వాదన. నిజానికి అదృష్టవంతుడు అంటే ఎవరో కాదు, కిందపడ్డ ప్రతీసారి లేచి నిలబడేవాడు. ఎదురుదెబ్బలు, కష్టనష్టాలు, అవరోధాలు- జీవితంలో ఒక భాగం అనుకుని ముందుకు సాగేవాడు. ఈ సత్యాన్ని అంగీకరిస్తే జీవితం ఎవరికీ కఠినంగా అనిపించదు. అప్పుడు ప్రతి మనిషి మానసికంగా ఎదగడానికి ప్రయత్నిస్తాడు. ప్రతీ సమస్య వెనకా ఒక అవకాశం ఉందని భావించి ఆశావాదంతో ముందడుగు వేస్తాడు.

చాలామంది తమను దురదృష్టం వెంటాడుతోందని, అవకాశాలు రాకుండా ఎవరెవరో అడ్డుకుంటున్నారని, కొందరు మోసం చేస్తున్నారని భావిస్తుంటారు. నిజానికి మనకు ఏది రావాలో అదే వస్తుంది. అల్లాహ్కు ఎవరిమీదా పక్షపాతం ఉండదు. ఎవరు దేనికి అర్హులో అదే వారు పొందుతారు. కష్టే ఫలి. -

(అతనికి చెప్పు: పాప) భారం మోసేవాడెవడూ ఇతరుల (పాప) భారం మోయలేడు. మానవుడు దేని కోసం కృషిచేస్తాడో అదే

అతనికి లభిస్తుంది. అతని కృషికి త్వరలోనే గుర్తింపు లభిస్తుంది. అతనికి దాని ప్రతిఫలం పూర్తిగా ఇవ్వబడుతుంది. (నజ్మ్: 38-41)

సగటు మనిషి బతుకంతా కన్నీటి ఎదురీతా ఏ తీరం దొరకని ఈ పయనం ఎంత దూరమో.... ఎంత కాలమో... ఎలా ఇలా ఆగడం ఇలా ఎలా సాగటం అని నిరాశ చెందనవసరం లేదు నిస్పృహకు లోనవ్వాల్సిన పనీ లేదు.

## ప్రవక్త (స) విధేయతే పరమావధి

ఉత్తమ కార్యాలు చేస్తూ ఉదాత్త వ్యూహంతో ముందుకు సాగితే ఆ మనిషికీ తప్పక అల్లాహ్ సహాయం తోడవుతుంది. అప్పుడు అవకాశాలు వాటంతటవే వెతుక్కుంటూ వస్తాయి. చేతికందిన అవకాశాలను స్వార్థప్రయోజనాలకు కాకుండా, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ఉపయోగించాలి. దానం, పరోపకారం, సమాజ సేవ నిర్వహించే అవకాశాలు వచ్చినప్పుడు వాటిని దైవ కార్యాలుగా భావించి నెరవేర్చేందుకు ప్రయత్నించాలి.

అల్లాహ్ అంతిమ ప్రవక్త ముహమ్మద్(స)- దైవదౌత్యం ప్రసాదించబడిన తర్వాత ప్రజలే తమ వద్దకు రావాలి, జ్ఞానాన్ని నేర్చుకోవాలి, తెలియని విషయాలు తెలుసుకోవాలి అని ఉన్న చోట కూర్చొని ఎదురు చూడలేదు. కనిపించే వ్యక్తిని ఆయన ప్రేమగా పలుకరించారు. అగుపడ్డ ప్రతి తెగ, బృందం వద్దకు వారు పిలువక పోయినా తానే వెళ్లారు. అలా ఆయనోసారి భోం చేస్తున్నారు - అటుగా ఓ బృందంగా వెళ్లడం ఆయన గమనించారు. ఆహరం వదిలేసి బిరబిరా వారి వెనక వెళ్ళసాగారు, అది గమనించిన సతీమణి - దైవప్రవక్తా! ప్రశాంతంగా భోజనం పూర్తి చేసుకొని వెళ్ళొచ్చుగా అని చెప్పగా - ఓ నా ప్రాణ సఖీ! రేపు ప్రళయ దినాన - అల్లాహ్, నీ గుమ్మం ముందు నుండే ఓ బృందం వెళ్ళింది - నువ్వెందుకు వారికి ధర్మ సందేశాన్ని అందజేయలేదు అని అని నిలదీస్తే నేనేమని జవాబివ్వాలి?- అలా ఆయన లోక కల్యాణాన్ని, ప్రజా శ్రేయాన్ని విపరీతంగా కోరుకున్నారు గనుకనే - ఆయన అనుకున్నది సాధించుకోగలిగారు, దానికి అల్లాహ్ నుండి తోడ్పాటు లభించింది.

మనమూ దారి గుండా వెళుతుంటాము. గోడ మీద వ్రాయబడి ఓ మంచి మాట మనల్ని ప్రేరేపిస్తుంది. అంతెందుకు - పల్లీలు తిన్నాక అవి చుట్టిన పొట్లంలోని పలుకులు మనల్ని ఆకట్టు కుంటాయి. మనకు మంచి చేయాలన్న సంకల్పం ఉండాలే గాని మార్గాలు అనేకం ముందుంటాయి. మనం వ్రాసిన ఒక మంచి వ్యాసం కావచ్చు, పంచిన ఓ మంచి కరపత్రం కావచ్చు - అది చదివిన వెయ్యి మందిలో ఒకరిద్దరూ ప్రేరణ పొందినా దానికి మించిన పుణ్యకార్యం మరొకటి లేదు. మహనీయ ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: “నీ మూలంగా అల్లాహ్ ఒకే ఒక్క వ్యక్తికి సన్మార్గం చూపినా - అది నీ పాలిట ప్రపంచ సకల సంపదలకంటే ఎంతో ఉన్నతమైనది” (తబ్రానీ)

వారికిలా చెప్పు: “మీరు నిజంగా అల్లాహ్‌ను ప్రేమిస్తుంటే నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు, మీ పాపాలు క్షమిస్తాడు. అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు. (ఆలె ఇమ్రాన్: 31)

“వారికి (ఈ సంగతి కూడా) చెప్పు: “అల్లాహ్‌కు, దైవప్రవక్తకు విధేయులై ఉండండి. ఒకవేళ మీరు (నిర్లక్ష్యంతో) ముఖం తిప్పుకుంటే గుర్తుంచుకోండి- ప్రవక్తపై మోపబడిన బాధ్యతకు ప్రవక్త బాధ్యుడవుతాడు. కాని మీపై ఉన్న బాధ్యతకు మీరే బాధ్యులవుతారు (నూర్: 54)

## ఆత్మావలోకన సమయం ఆసన్నమయ్యింది

“ఈ 365 రోజులు మనం ఏమైపోయాము? ఉన్నట్టుండి నూతన సంవసర సంబరాలు అంబరాన్ని అంటడం దేన్నీ సూచిస్తోంది? మనలోని ప్రతి ఒక్కరూ ఎవరికి వారు వేసుకోవాల్సిన ప్రశ్న ఇది. చనిపోయాక ఏం జరుగుతుందనే విషయం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంటే, ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలను కుంటారు. కానీ నిజంగా మనం దీన్ని ఎంత తీవ్రంగా తెలుసు కోవాలనుకుంటున్నాము? 'మరణం తర్వాత ఏమవుతుంది? మన సృష్టికి మూలం ఏమిటి?', కారణం ఏమిటి? అన్న ప్రశలన్నింటికీ ఇస్లాం చక్కటి సమాధానం ఇచ్చింది. మరి ఏళ్ళు గడిచిపోతున్నా- మన ముందరే మన ఆప్తులయిన ఎందరో కాటికి ఏగుతున్నా మనం మాత్రం చలనం లేని పాషాణాలుగా మారి ఎదో బతుకు తున్నామంటే బతుకుతున్నామన్నట్టు యాంత్రికంగా బతికేస్తు న్నాము. ఆ విషయానికొస్తే కొన్ని సందర్భాలలో రాళ్లు కూడా కరుగుతాయి కానీ మనం కరగడం లేదు.

అయితే అంతటి గొప్ప మహిమ చూసినా మీలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా మీ హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమయి పోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటి ఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలి పోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే అల్లాహ్ భీతితో కంపించి క్రిందపడిపోతాయి. అల్లాహ్ మీ చేష్టలను గమనించడం లేదని భావించకండి. (బఖరః - 74)

## దేని కోసం ఎదురు చూస్తున్నాము?

"కనుక అల్లాహ్ (మార్గం) వైపునకు పరుగెత్తండి. నేను ఆయన తరపున మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించడానికి వచ్చిన సందేశ హరుణ్ని. (జారియాత్: 50)

మీ ప్రభువు క్షమాభిక్ష వైపు పరుగెత్తండి. భూమ్యాకాశాలంత విశాలమైన స్వర్గసీమ వైపుక్కూడా పరుగెత్తండి. అది భయభక్తులు కలవారి కోసం సిద్ధం చేయబడి ఉంది. (ఆలె ఇమ్రాన్: 133)

విశ్వాసులారా! రెండింతలు, నాల్గింతలు పెరిగే ఈ వడ్డీని తినడం ఇకనైనా మానుకోండి. అల్లాహ్‌కు భయపడండి, మీ జీవితాలు సార్థకమవుతాయి. సత్యతిరస్కారుల కోసం సిద్ధం చేయబడిన నరకాగ్ని నుండి తప్పించుకోండి. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులయి ఉండండి, మీరు కరుణించబడతారు. (ఆలె ఇమ్రాన్ 130-132)

తాను మంచి చేయాలి అని అనుకునే వ్యక్తి దాని కోసం తొందర పడాలి. ఆలస్యం చేస్తే అతను వ్యాధి బారినయినా పడవచ్చు లేదా తన వాహనాన్ని అయినా పోగొట్టు కోవచ్చు. లేదా ఇంకా ఏదయినా ఆటంకం ఏర్పడవచ్చు.

విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావనతో ద్రవించే సమయమింకా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగి పోయే వేళ ఆసన్నం కాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓ సుదీర్ఘకాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమై పోయాయి. ఈనాడు వారిలో చాలామంది దుర్మార్గులై ఉన్నారు. మీరలా కాకూడదు సుమా! వినండి! భూమి మృతప్రాయమైన తర్వాత అల్లాహ్ దానికి తిరిగి జీవం పోస్తున్నాడు. (అలాగే మృతప్రాయమైన మానవతక్కూడా ప్రవక్తల ద్వారా జీవం పోస్తున్నాడు.) మీరు విషయం గ్రహిస్తారని మా సూచనలను మీకు విడమరచి చెబుతున్నాం. (హదీద్: 16-17)

### ముందస్తు ప్రణాళిక ముఖ్యం

మనం ఏ పని చెయ్యాలన్నా రేపటి పని ఈ రోజు చెయ్యి. ఈ రోజు పని ఇప్పుడే చెయ్యి అని చెప్తూ వుంటాం. అలాగే సమయ పాలన కూడా చేస్తే మనం ఎన్నో సమస్యలనుండి బయట పడగలం. విద్యార్థులు "పరీక్షలు ఇంకా చాలా రోజులు ఉన్నాయిగా ఇప్పటినుండే ఎందుకు చదవడం? తీరా పరీక్షల సమయంలో చదివిందంతా మరిచి పోతాం" అంటూ చివరి రోజు వరకు పుస్తకం తియ్యరు. తీరా చూస్తే అప్పుడు ఏ జ్వరమో ఇంకేదో సమస్య వచ్చి పరీక్షలు సరిగ్గా వ్రాయలేక ఫెయిల్ అవుతూ ఉంటారు.

ఇక ఆఫీసుకు వెళ్ళే వాళ్ళు చివరి క్షణం వరకు తయారవకుండా మొహం కడుక్కోవడం మొదలు అన్ని పనులు చివరి అరగంటలో చేసేసుకుంటే చాలు అనుకోవడం చూస్తూ వుంటాం. ఇలా చెయ్యడం వల్ల వాళ్ళల్లో బీపీలు పెరిగిపోయే అవకాశం ఉంది. సమయానికి ఐడెంటిటీ కార్డ్ కనపడక పోవడం, బండిలో పెట్రోల్ లేదని గుర్తు రావడం, ఒకవేళ బస్సులో వెళ్ళేవారైతే ఆ రోజు బస్సు ఆలస్యం అవడం జరిగితే వారి ప్రోగ్రాం అస్తవ్యస్తం అవుతూ వుంటుంది.

(మిగతా వచ్చేవారం)

యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

36 – 38 మీకు ఇవ్వబడినదేమయినా అంతా కొన్నాళ్ళ ఐహిక జీవన సామగ్రి మాత్రమే, మరేదయితే అల్లాహ్ వద్ద ఉన్నదో అది ఉత్తమమయినదీ సుస్థిరమయినదీను. ఇది వీరి కొరకే ప్రత్యేకం–వారు విశ్వసించిన వారు, తమ ప్రభువుపైన భారం మోపేవారు, పెద్ద పెద్ద పాపాలకు, లజ్జావిహీనమయిన పోకడలకు దూరంగా మసలుకునేవారు,[58] ఇంకా కోపం వస్తే మన్నించివేసేవారు,[59] తమ ప్రభువు ఆదేశాలను పాటించేవారు,[60] నమాజ్ స్థాపించేవారు, తమ వ్యవహారాలను పరస్పర సలహా సంప్రతింపులతో నడుపుకునేవారు,[61] మేము వారికి ప్రసాదించిన ఉపాధిలో నుండి ఖర్చుపెట్టేవారు.

58. వివరణకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.2, అన్ నిసా: ఆయత్:31 అల్ అన్ ఆమ్: ఆయత్ 151 సం.4, అన్ నహ్ల్: ఆయత్: 91 సం.8, అన్ నజ్మ్: ఆయత్ 32.

59. అంటే, వారు కోపిష్ఠులూ, చీదరించుకునేవారూ కారు. మృదు స్వభావులు, నెమ్మదస్థులుగా ఉంటారు. వారి నైజం ప్రతీకారపూర్వకమయింది కాదు, వారు మానవుల పట్ల చూపోపు, మన్నింపు వైఖరినవలంబించేవారు. ఏదయినా విషయంలో ఆగ్రహం కలిగినా దాన్ని దిగమ్రింగుతారు. ఈ గుణం మానవుని అత్యుత్తమ గుణాలలోనిది. దీన్ని దివ్య ఖుర్‌ఆన్ అత్యంత శ్లాఘనీయమయినదిగా పరిగణించింది. (ఆలి ఇమ్రాన్: 134). దైవ సందేశహరుని విజయ సఫలతలకు ప్రధాన కారణాలలో ఒకటిగా పేర్కొన్నది (ఆలి ఇమ్రాన్ : 159). హదీసులో హజ్రత్ ఆయిషా (ర) ప్రకారం, "ప్రవక్త మహనీయులు(స) తన స్వంత విషయంలో ఎన్నడూ ప్రతీకారం తీర్చుకోలేదు. అయితే అల్లాహ్ నిర్ణయించిన పవిత్ర విషయాలలో ఏ పవిత్రమయినదాన్నయినా కించపరచినట్లయితే అప్పుడు ఆయన(స) దానికి శిక్ష విధించేవారు (బుఖారీ, ముస్లిమ్).

60. శాబ్దిక అనువాదం, "తమ ప్రభువు పిలుపునకు ప్రత్యుత్తరం ఇస్తారు" అన్నది. అంటే, అల్లాహ్ ఏ పని కొరకు పిలిచినా దాని కొరకు పరిగిడి వస్తారు, అల్లాహ్ దేన్ని గురించి సందేశమిచ్చినా దాన్ని స్వీకరిస్తారు అన్నమాట.

61. ఈ విషయాన్ని ఇక్కడ విశ్వాసుల ఉత్తమోత్తమ గుణంగా లెక్కించడం జరిగింది. ఆలి ఇమ్రాన్ సూరాలో (ఆయత్ : 159) దీన్ని ఆదేశించడం జరిగింది. ఈ కారణంగా సలహా సంప్రతింపులు ఇస్లామీయ జీవిత విధానంలో ప్రముఖమయిన అంశం. సలహా సంప్రతింపులు లేకుండా సామూహిక కార్యాలు నిర్వహించడం కేవలం అజ్ఞానపూర్వకమయినదే కాదు, అల్లాహ్ నిర్ణయించిన నియమావళిని ఉల్లంఘించడం కూడా అవుతుంది. సలహా సంప్రతింపులకు ఇస్లామ్‌లో ఈ ప్రాముఖ్యత ఎందుకు ఇవ్వబడిందీ అన్నదాని కారణాలను పరిశీలిస్తే మూడు విషయాలు స్పష్టంగా ముందుకు వస్తాయి.

ఒకటి, ఏ వ్యవహారంలోనయితే ఇద్దరు లేదా ఇద్దరిని మించిన వ్యక్తుల ప్రయోజనం ఇమిడి ఉంటుందో అందులో ఒక వ్యక్తి తన అభిప్రాయంతో నిర్ణయాలు చేసివేయడం, సంబంధిత ఇతర వ్యక్తుల్ని ఉపేక్షించడం అన్యాయం. సమిష్టి కార్యాల్లో ఎవరికీ తన ఇష్టమయినట్లుగా వ్యవహరించే అధికారం లేదు. న్యాయం కోరేదేమిటంటే, వ్యవహారం ఎందరు వ్యక్తుల ప్రయోజనాలకు సంబంధించినదో వారందరి అభిప్రాయాన్ని సేకరించాలి. అది చాలా పెద్ద సంఖ్యలోని ప్రజలకు సంబంధించిన విషయమయితే ఆ జనుల విశ్వసనీయులయిన ప్రతినిధులకు సలహా సంప్రతింపులలో భాగం కల్పించాలి.

రెండు, మనిషి సమిష్టి వ్యవహారాలలో తనకు ఇష్టమయినట్లుగా వ్యవహరించడానికి ప్రయత్నం చేసేది, తన స్వప్రయోజనాల కొరకు ఇతరుల హక్కులను కాజేయదలచినప్పుడు లేదా అతను తన్ను తాను ఒక గొప్పవానిగా భావించి, ఇతరుల్ని హీనులుగా తలపోసినప్పుడు. నైతికంగా ఈ రెండు గుణాలూ సమంగా హేయమయినవి. వీటిలో ఏ గుణమయినా చూచాయగా కూడా విశ్వాసిలో కానరావడానికి వీలులేదు. విశ్వాసి స్వార్థపరుడూ కాజాలడు, ఇతరుల హక్కుల్ని కాజేసి స్వయంగా అధర్మప్రయోజనాలు ఆర్జించడాన్నీ అభిలషించడు. అతను అహంకారి, స్వీయోత్కర్షగలవాడూ కాజాలడు, తన్ను తానే సర్వోపరి వివేకి అని, అన్నీ తెలిసినవాడు సకల సమాచారం ఎరిగినవాడు అనీ భావించడు.

(61వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

## హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) విశిష్ఠత

**348)** తన తండ్రి తనకు తెలియజేశారని అబూ హాజిమ్ వివరించారు : ఒక వ్యక్తి హజ్రత్ సహ్ల్ బిన్ సాద్(రజి) దగ్గరకు వచ్చి, 'విన్నారా! ఫలానా వ్యక్తి (మదీనా గవర్నర్ మర్వాన్) మస్జిద్ వేదికపై కూర్చుని మహనీయ అలీ(రజి) గురించి నోరు పారేసుకుంటున్నాడు' అని ఫిర్యాదు చేశాడు. అబూ హాజిమ్ ఇలా అన్నారు: "ఇంతకీ ఏమన్నాడేమిటి?" అని సహ్ల్ బిన్ సాద్(రజి) విచారించగా, 'అలీ(రజి)ని అబూ తురాబ్[1] అంటున్నాడు' అని ఆ వ్యక్తి చెప్పాడు. అది విని మహనీయ సహ్ల్ తొలుత నవ్వేశారు. తరువాత ఇలా అన్నారు: "దైవసాక్షి! ఇది ఆయనకు దైవ ప్రవక్త (స) పెట్టిన పేరు. స్వయంగా హజ్రత్ అలీ(రజి) కూడా ఈ పేరు (కునీయత్)ను అమితంగా ఇష్టపడేవారు'. ఇది విని నేను ఈ హదీసు పూర్వాపరాలను గురించి సహ్ల్ బిన్ సాద్(రజి) నోట వినదలిచాను. 'ఓ అబూ అబ్బాస్![2] ఈ సంఘటన గురించి కాస్త వివరిస్తారా?' అని నేను విన్నవించుకోగా, ఆయన ఇలా వివరించారు: "ఒకసారి మహనీయ అలీ(రజి) ఫాతిమా(ర.అ) దగ్గరకు వచ్చారు. అక్కడి నుంచి సరాసరి మస్జిద్‌కు వెళ్ళి అక్కడే పడుకున్నారు. తరువాత దైవప్రవక్త(స) ఫాతిమా వద్దకు వచ్చి "నీ పెత్తండ్రి కొడుకు[3] ఎక్కడ?" అని అడిగితే, మస్జిద్‌లో ఉన్నారని ఆమె చెప్పారు. దైవప్రవక్త(స) మస్జిద్‌కు వచ్చి చూస్తే అలీ(రజి) పడుకుని ఉన్నారు. ఆయన కప్పుకున్న దుప్పటి కూడా క్రిందపడిపోయి ఉంది. అలీ వీపుకు మట్టి అంటుకుని ఉంది. దైవప్రవక్త(స) ఆ మట్టిని తుడుస్తూ "ఓ అబూ తురాబ్ (మట్టి కొట్టుకున్నవాడా! లే. లేచి కూర్చో" అన్నారు ఆప్యాయంగా.

**349)** సాద్ బిన్ ఉబైదా తెలిపారు: ఒక వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) దగ్గరకు వచ్చి, హజ్రత్ ఉస్మాన్ (రజి) గుణశీలముల గురించి వాకబు చేశాడు. ఇబ్నె ఉమర్ ఉస్మాన్(రజి)లోని సద్గుణాలను గురించి ప్రస్తావించారు. తరువాత "బహుశా ఈ మాటలు నీకు రుచించలేదేమో!" అన్నారు. దానికి అతను 'అవున'న్నాడు. అది విన్న ఇబ్నె ఉమర్, "అల్లాహ్ నీ ముక్కుకు మన్ను తగిలేలా చెయ్యుగాక!" అని వ్యాఖ్యానించారు. తరువాత ఆ వ్యక్తి, హజ్రత్ అలీ(రజి) గురించి అడిగాడు. ఆయన అలీ(రజి)లోని మంచిని గురించి కూడా ప్రస్తుతించారు. హజ్రత్ అలీ(రజి) కుటుంబం దైవప్రవక్త(స) వంశంలోని అత్యంత మంచి కుటుంబం అని కూడా చెప్పారు. తరువాత "బహుశా ఈ మాటలు కూడా నీకు జీర్ణం కాలేదేమో!" అన్నారు. దానికి అతను 'అవున'న్నాడు. అప్పుడు హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి), "అల్లాహ్ నీ ముక్కుకు మన్ను తగిలేలా చెయ్యుగాక. పో, నీకు చేతనయింది చేసుకో పో"[1] అన్నారు.

348-1. అలీ (రజి)ని కించపరిచే ఉద్దేశంతో మర్వాన్ అలా అన్నాడు. కాని దైవప్రవక్త(స) వాత్సల్యంతో అలా పిలిచారని అతనికి తెలీదు.

348-2. ఇది సహ్ల్ బిన్ సాద్(రజి) గారి కునీయత్

348-3. తాతను తండ్రిగా సంబోధించారు. అబూ తాలిబ్ హజ్రత్ ఫాతిమా (ర.అ)కు తాత అవుతారు.

349-1. ప్రశ్నించిన ఆ వ్యక్తి పేరు నాఫే. అతను ఖారిజీ వర్గానికి చెందినవాడు. అతను హజ్రత్ ఉస్మాన్(రజి)తోపాటు హజ్రత్ అలీ (రజి)ని కూడా చెడ్డవారుగా భావించేవాడు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు హజ్రత్ అలీ (రజి) కుటుంబీకుల మంచితనాన్ని కూడా ప్రస్తావించారు. కాని ఖారిజీలు ఆయన కుటుంబీకుల సేవల్ని విస్మరించి, అలీ (రజి) పట్ల తిరుగుబాటు ధోరణిని అవలంబించారు. చివరకు పరాభవం పాలయ్యారు.



# విశ్వాసాలు

## విశ్వాసాల వాస్తవికత, ప్రాముఖ్యత-2

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

ఒక్క మాటలో చెప్పాలంటే 'విశ్వాసం' లేని 'ఆచరణ' పునాది ఏ ఉన్నత భావంపై కూడా నెలకొని ఉండజాలదు. అందుకే ప్రదర్శనా బుద్ధి, స్వార్థంతో కూడిన కార్యకలాపాలకు గౌరవం ఇవ్వబడ (రా)దు. ఈ కారణంగానే అల్లాహ్ తన సందేశహరుని (స) ద్వారా ముస్లింలను ఇలా హెచ్చరించాడు :

> **విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొంద టానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా అల్లాహ్‌నూ అంతిమ దినాన్నీ విశ్వసించని వాని మాదిరిగా, మీరు దెప్పి పొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దానధర్మాలను మట్టిలో కలపకండి. అతడు చేసిన ధనవ్యయాన్ని ఈ విధంగా పోల్చవచ్చు: ఒక కొండ రాతిపై ఒక మట్టిపొర ఏర్పడి ఉంది. భారీవర్షం దానిపై కురవగా ఆ మట్టి కాస్తా కొట్టుకుపోయింది. చివరకు మిగిలింది ఉత్త కొండరాయి మాత్రమే. ఇలాంటి వారు తాము దానం చేస్తున్నామని భావించి చేసే పుణ్యకార్యం వల్ల వారికి ఏ ప్రయోజనమూ కలుగదు. అవిశ్వాసులకు సత్యమార్గం చూపటం అల్లాహ్ సంప్రదాయం కాదు. *(అల్ బఖరహ్ : 264)***

చెప్పవచ్చేదేమంటే విశ్వాసం (ఈమాన్) మన ఆచరణలన్నింటికీ ప్రాతిపదిక. అది లేని ఆచరణ ఏదయినాసరే దానికి భూమిక అన్నదే లేదు. విశ్వాసమే మన దాహాన్ని తీర్చే మూలసరోవరం. అది కొరవడిన నాడు ఆచరణలు ఎండమావి కన్నా ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉండవు. చూసేవారికైతే ఆ కర్మలు కర్మలుగానే కానవస్తుం టాయి. కాని వాటిలో ఆధ్యాత్మిక శక్తి ఉండదు. పస ఉండదు. అవి నిష్ఫలమైనవే. దేవుని ఉనికిని అంగీకరించి, ఆయన ప్రసన్నతను బడయటమే అసలు మన ఆచరణల ముఖ్య లక్ష్యం. ఇవి లేనప్పుడు మన కర్మలన్నీ నిరర్థకమే. విశ్వాసమే మన మనోకాంతి. అది లేని జీవితం దట్టమైన చీకటి వంటిది. మనం ప్రపంచంలో కోరుకున్న కీర్తి ప్రతిష్ఠలు, స్వప్రయోజనాలు, పదవులు లభిస్తే లభించవచ్చుగాక! కాని నిజధ్యేయం మాత్రం ప్రాప్తమవదు.

తౌరాతు గ్రంథంలో కొన్ని విశ్వాసాల ప్రస్తావన వచ్చింది గాని వాటి వాస్తవికతను, ప్రాముఖ్యతను అది వివరించలేదు. ఇంజీలు గ్రంథంలో విశ్వాసం ఆవశ్యకత గురించి నొక్కి చెప్పటం జరిగింది. కాని దానిని ఆచరణల కోసం కాకుండా మహిమల వైపునకు, కఠోర అభ్యాసాల వైపునకు గొనిపోవటం జరిగింది. దీనికి భిన్నంగా గ్రీకు తత్వవేత్తలు, భారత దేశంలోని వివిధ మతాల వారు విశ్వాసాన్ని ఏకాంత కుహరాలకు, ధ్యాన కేంద్రాలకు, సన్యాసుల ఆశ్రమాలకు, బైరాగుల మఠాలకు, సాధువులకు, తపోనిష్ఠాపరాయణులకు పరిమితం చేశారు. విశ్వాసానికి – ఆచరణకు మధ్య సమన్వయం సాధించలేదు. ఈ విధంగా క్రైస్తవులు, జోరాష్ట్రియన్లు, బ్రాహ్మణులు 'విశ్వాసాల'కు ఎంత విస్తృతిని ఇచ్చారంటే, అవి ఆపాదమస్తకం ఊహాజనిత తత్వంగా మారిపోయాయి. దాని భావన (ఊహ) ఆచరణపై ఆధిపత్యం వహించింది. మానవుని క్రియాత్మక శక్తులు స్తంభించిపోయాయి.

దీనికి భిన్నంగా మహాప్రవక్త (స) విజ్ఞానానికి– ఆచరణకి మధ్య సమన్వయం సాధించారు. మనిషిలోని 'విశ్వాసం' (ఈమాన్) ఓ విశిష్ట నడవడిని సృజించాలని నొక్కి వక్కాణించారు. విశ్వాసం ఒకసారి మానవ మనోభూమిలో నాటుకోగానే అది అతని నైతిక తలో విప్లవాత్మక మార్పును తీసుకురావాలని, అది క్రియాత్మక జీవితానికి ప్రాతిపదిక కావాలని చాటి చెప్పారు.

ముహమ్మద్ ప్రవక్త (స) విశ్వాసాలను స్పష్టమయిన వాక్యాలలో అయిదు పాయలుగా విభజించారు –

1. అల్లాహ్‌పై విశ్వాసం
2. దైవదూతలపై విశ్వాసం
3. దైవప్రవక్తలపై విశ్వాసం
4. దైవగ్రంథాలపై విశ్వాసం
5. శిక్షాబహుమానాల దినంపై విశ్వాసం

ఈ యధార్థాలను హృదయపూర్వకంగా విశ్వసించి, నోటితో అంగీక రించటం అవసరం. ఇది లేకుండా ఆచరణలో చిత్తశుద్ధి అనేది ఉండదు. అల్లాహ్‌పై విశ్వాసం అంటే ఏమిటి? ఆయన ఈ విశ్వాని కంతటికీ సృష్టికర్త అనీ, యజమాని అనీ, అంతర్బాహ్యాలన్నింటినీ ఎరిగినవాడని నమ్మటం. అప్పుడే ఆయన మన కార్యకలాపాలన్నిం టికీ కేంద్ర బిందువు కాగలుగుతాడు. ఆ సర్వజ్ఞాని మనల్ని అనుక్షణం కనిపెట్టుకుని ఉన్నాడనే నమ్మకమే మనల్ని పాపాలకు, అవిధేయతా కార్యాలకు దూరంగా ఉండేలా చేస్తుంది.

దైవప్రవక్తలపై విశ్వాసం కూడా అవశ్యమే. ఎందుకంటే, దైవాజ్ఞలు, దైవ మార్గదర్శకత్వం, దైవాభీష్టం మొదలైనవన్నీ దైవప్రవక్తల ద్వారానే మనుషులకు అందాయి. వారి సచ్ఛీలతని, రుజువర్తనని గనక మనం అంగీకరించకపోతే దైవాదేశాల వాస్తవికత, సత్యం కూడా సందేహా స్పదం అయిపోతుంది.

దైవదూతలపై విశ్వాసం కూడా అవసరమే. ఎందుకంటే వారు దైవా నికి– దైవప్రవక్తలకి మధ్యన దూతలు, రాయబారులు, సందేశ వాహకులు. భౌతికతకి ఆధ్యాత్మికతకి మధ్య వారధి వంటివారు. వారు సృష్టితాలను దైవశాసనాల కనుగుణంగా నడుపుతారు. మన కర్మలను, ఆచరణలను అనుక్షణం పర్యవేక్షిస్తూ వాటిని లిఖిస్తారు. మనం వాటి బహుమానం పొందడానికి లేదా శిక్షార్హులం అవడానికి ఈ రికార్డు చాలా అవసరం.

దైవప్రవక్తల ద్వారా మానవులకు అందజేయబడిన దైవాజ్ఞలు, నిర్దేశిక నియమాలను దూర దేశాలకు, వివిధ మారుమూల ప్రాంతాలలో ఉన్న వారికి అందజేయడానికి అవి లిఖితపూర్వక గ్రంథాల రూపం లోనో, రికార్డింగ్ యంత్రాల రూపంలోనో ఉండటం అవసరం. అలా ఉంటేనే భావితరాలవారు వాటిని చదవగలుగుతారు. వినగలుగు తారు. అలాంటి లిఖితపూర్వక దైవగ్రంథాలను, సహీఫాలను నమ్మి నడుచుకోవటం కూడా చాలా అవసరమే. అన్యధా ఏది సత్యమో – ఏది అసత్యమో, ఏది ధర్మసమ్మతమో– ఏది అధర్మమో, ఏది సత్కార్యమో–ఏది దుష్కార్యమో మనకు తెలియజాలదు.

మన ఆచరణల గురించి నిలదీసే వాడొకడున్నాడనీ, ఈ ప్రపంచంలో తాను చేసిన ప్రతి చేష్ట గురించి సర్వోన్నత న్యాయాధీశుని ఎదుట లెక్క ఇవ్వాల్సి ఉందనే ఆలోచన గనక లేనట్లయితే మనిషికి ఈ ప్రపంచంలో పట్టపగ్గాలుండవు. ఇక్కడి శాసనాలను, న్యాయస్థానా లను మనిషి అస్సలు లెక్కచేయడు. అతను నరరూప రాక్షసుడుగా మారి మానవ హక్కులను మంటగలుపుతాడు. అందుకే మనిషికి పరలోకంపై నమ్మకం, శిక్షా బహుమానాల అంతిమ దినంపై విశ్వాసం చాలా అవసరం. ఇది కూడా ఈమాన్ (విశ్వాసం)లో ఒక భాగమే. అందుకే మహాప్రవక్త(స) ఈ అంశానికి చాలా ప్రాధా న్యత ఇచ్చారు.

ఈ అయిదు విషయాలే ఈమాన్‌లోని కీలకాంశాలు– అంటే అల్లాహ్‌పైన, ఆయన ప్రవక్తలపైన, ఆయన దూతలపైన, ఆయన గ్రంథాలపైన, తీర్పు దినంపైన విశ్వాసం కలిగి ఉండటం. ఈ అయిదు అంశాలు అల్ బఖరా సూరాలో అనేకసార్లు పునరావృతం అయినాయి. అవి కొన్నిచోట్ల క్లుప్తంగానూ, మరికొన్నిచోట్ల వివరం గానూ ప్రస్తావనకు వస్తాయి.

> **వారు అగోచర యధార్థాలను విశ్వసిస్తారు. నమాజును స్థాపి స్తారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుండి ఖర్చుపెడ తారు. (ప్రవక్తా!) వారు నీపైన అవతరింపజేయబడిన దానినీ, నీకు పూర్వం అవతరింపజేయబడిన గ్రంథాలను కూడా విశ్వసి స్తారు.** ***(అల్ బఖరా–3,4)***
>
> **పరలోకంపై కూడా దృఢ నమ్మకం కలిగి ఉంటారు.(అల్ బఖరా–4)**

ఇవైతే సూరా ఆరంభంలోని ఆయత్‌లు. సూరా మధ్యలో మళ్లీ ఇలా ఉపదేశించటం జరిగింది :

> **అల్లాహ్‌ను, అంతిమదినాన్ని, దైవదూతలను, దైవగ్రంథాన్ని, దైవ సందేశహరులను విశ్వసించేవాడే అసలు సదాచార సంపన్నుడు. (అల్ బఖరా – 177)**

సూరా చివర్లో ఇలా అనబడింది :

> **దైవప్రవక్త తన ప్రభువు తరఫు నుండి తనపై అవతరింప జేయబడిన గ్రంథాన్ని విశ్వసించాడు. విశ్వాసులు కూడా దానిని విశ్వసిస్తున్నారు. వీరంతా అల్లాహ్‌ను, దైవదూతలను, దైవగ్రంథాలను, దైవప్రవక్తలను నమ్ముతున్నారు.**
>
> ***(అల్ బఖరా – 285)***

అన్ నిసా సూరాలో కూడా ఈ విశ్వాసాలను గురించే ప్రబోధిం చటం జరిగింది :

> **విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ, ఆయన తన ప్రవక్తపై అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఇంకా ఆయన దీనికి పూర్వం అవతరింపజేసిన ప్రతి గ్రంథాన్నీ విశ్వసించండి. అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమదినాన్ని తిరస్కరించినవాడు నిశ్చయంగా మార్గం తప్పి అపమార్గంలో పడి చాలాదూరం పోయాడు.**
>
> ***(అన్ నిసా : 136)***

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***

# పిల్లలు ఏం కావాలి...?



- డాక్టర్ ముహమ్మద్ హసన్

**“మీ పిల్లలు మీ పిల్లలే కారు! వాళ్ళు మీ ద్వారా వచ్చారు కానీ, మీవల్ల కాదు. మీతోనే ఉంటున్నా మీకు చెందినవారు కారు. మీ ప్రేమను వారికి ఇవ్వగలరే కానీ మీ ఆలోచనలనే మాత్రం ఇవ్వలేరు. వారికున్నాయి స్వీయ ఆలోచనలు” అంటాడు ఖలీల్ జిబ్రాన్.**

నిజంగా మరి పిల్లలకేం కావాలి పిల్లలేం కావాలి, వారు మన నుండి ఏం ఆశిస్తున్నారు? సంరక్షకులుగా మనం వారికి ఏమి ఇవ్వాలి, ఎలాంటి వాతావరణం మనం కల్పించాలి, ఏ విధమైన టువంటి సౌకర్యాలు కల్పించాలి, ఏ విధమైన శిక్షణా పరమైన మానసిక సంసిద్ధతను మనం తల్లిదండ్రులుగా కల్పించాలనేది ప్రశ్న. ఇటువంటి సంక్లిష్టమైన సంఘర్షనాత్మకమైన సంశయాలకు సమాధానం ఎవరు ఇస్తారనేది కూడా ప్రశ్నే. “మనిషి సంఘజీవి” అంటాడు ప్రఖ్యాత తత్త్వవేత్త అరిస్టాటిల్. సంఘం నుండి మనిషిని వేరుచేసి చూడలేం. ఒకవేళ మనిషిని సంఘం నుండి లేదా సమూహం నుండి బహిష్కరిస్తే అతని మానసిక స్థితి ఎలా వుంటుంది, అతని ప్రవర్తనపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది కూడా మానసిక శాస్త్రవేత్తలు వివిధ ప్రయోగాల ద్వారా నిరూపించారు. అంటే కుటుంబం నుండి మనిషిని వేరుగా ఊహించలేము. ఇవన్ని ఊహాజనిత ఆలోచనలు పరిశోధనలకు శాస్త్రీయ నిరూపణలు ఆధారం అవుతాయి కాబట్టి వాటి ఫలితాలు కూడా కాదనలేని వాస్తవం అందుకే ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త జె.బి. వాట్సన్ ఇలా అంటాడు. “నాకు డజన్ మంది పిల్లల్ని ఇవ్వండి నేను వారిని మీరు కోరిన విధంగా తీర్చిదిద్ది ఇవ్వగలను” అని అంటే పిల్లల్ని మనం ఎలా తయారు చేసుకోవచ్చునో పై స్టేట్మెంట్‌ను బట్టి అర్థం చేసుకోవచ్చు ఏమి తెలియని, ఎలాంటి ముద్రలు ఇంకా పడని పసి మనసులలో ఎలాంటి శిక్షణ వైపు వారిని మనం సన్నద్ధులను చేస్తామో అలాంటి వారే తయారుకాగలరు. ఇక్కడ చరిత్రలో నమోదు కాబడిన ఒక విషయాన్ని ప్రస్తావించదలిచాను. జర్మని ఛాన్సలర్ అడాల్ఫ్ హిట్లర్ బాల్యంలో జరిగిన సంఘటన. పాఠశాలలో చదువుతున్న రోజుల్లో ఒక యూదు టీచర్ హిట్లర్‌ను దండించటం జరిగింది. ఆ తర్వాత పెరిగి పెద్దవాడైన హిట్లర్ 1933లో జర్మనీ దేశానికి అధ్యక్షుడిగా మారిన తర్వాత “గెస్టపో” అనే రహస్య గూఢచార దళాన్ని ఏర్పాటు చేసి తనకు వ్యతిరేకంగా వున్న ఎంతో మంది యూదులను గ్యాస్ చాంబర్లో బంధించి చిత్రహింసలుపెట్టి చంపించిన సంఘటనలు చరిత్ర చెప్పిన సజీవ సాక్ష్యాలు.

అందుకే ప్రతి మనిషి జీవితంలో అత్యంత కీలక పాత్ర పోషించే దశ బాల్య దశ ఈ దశలో పడే ప్రభావాలపై పిల్లల మానసిక స్థితిపై ఆధారపడి వుంటుందనేది కాదనలేని వాస్తవం. గతమెంతో

ఘనకీర్తి అన్నట్లు మన సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవి ఒకప్పుడు సామూహిక జీవన విధానం వుండేది, ఇప్పుడు వ్యష్టి జీవితానికి అలవాటుపడి యాంత్రిక జీవితం వైపు  మొగ్గు చూపుతుండటం ఆధునికత సంతరించుకొని సామూహిక జీవనం నుండి ఒంటరితనం వైపు ప్రయాణించటం బాధ కల్గించే విషయం, అందుకే నేడు నిత్యం మైనర్లు పబ్బుల్లో, క్లబ్బుల్లో, రేవ్ పార్టీల్లో, డ్రగ్స్ బాధితులుగానో, అత్యాచార కేసుల్లో నిందితులుగానో, హింసాయుత సంఘటనల్లో పాల్గొనటం బాధ కల్గించే విషయం, అంటే లోపం ఎక్కడుంది, ఎవరిని దీనికి బాధ్యుల్ని చేయాలి అన్నది అసలైన ప్రశ్న, తల్లిదండ్రులదా, వారు కలిసి తిరిగిన సమవయస్కులదా, లేదా విద్యా సంస్థలదా? తప్పు జరిగిన తర్వాత కారణాలు, ఫలితాలు ఎలా ఉంటాయనేది నేర తీవ్రతను బట్టి నిర్ధారించే మరొక అంశం. ఇటీవలి కాలంలో హైద్రాబాద్ నడిబొడ్డున జరిగిన మైనర్ బాలిక అత్యాచార సంఘటనలో ఐదుగురు మైనర్లు, బాధిత బాలిక కూడా మైనరే కావటం ఇక్కడ ప్రస్థావనార్హం, పిల్లల శారీరక మానసిక పెరుగుదల, వికాసం తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వారికి సరైన మార్గదర్శనం చేస్తూ ఉండాలి. బాలిక ఐతే తల్లి, బాలుడు ఐతే తండ్రి చొరవ తీసుకొని వారిలో సహజమైన ప్రవర్తన అసహజమైన ప్రవర్తన వాటి వల్ల కలిగే పరిణామాలు, ఫలితాలు వివరించి చెప్పగలగాలి.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఏమి తెలియని పసి మనసులలో ఎలాంటి ముద్రలను మనం బలంగా వేస్తామో వాటినే పెద్దైన తర్వాత అనుసరించే ప్రమాదం వుంది. ఇక్కడ ప్రఖ్యాత తత్త్వవేత్త అరిస్టాటిల్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించాలి "చిన్నపిల్లల మనస్సు ఏమి వ్రాయని నల్ల బల్ల (Black Board) లాంటిది. దానికి "టబ్యులారాసా" అని పేరు పెట్టాడు. దీనిని బట్టి మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే పిల్లల మనస్తత్వాలు, వారు పెరిగే పరిసరాలు, కుటుంబ నేపథ్యం వారిని ఎలా ప్రభావితం చేస్తుందో మనం ఇక్కడ గమనించవచ్చును.

మారుతున్న జీవన సరళి, ఆకర్షింపబడుతున్న పాశ్చాత్య సంస్కృతి, కొడిగడుతున్న మానవ విలువలు, పలుచబడుతున్న సంబంధ బాంధవ్యాలు దీనికి తోడు మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల పిల్లల్లో కలిగే మానసిక, శారీరక మార్పుల ఫలితంగా వచ్చే మార్పులను అర్థం చేసుకోలేక సంఘర్షణకు గురై, తల్లిదండ్రులు పర్యవేక్షించక, సరైన మిత్రులు మార్గదర్శనం చేయక, ఉపాధ్యాయులు వారిలో వచ్చే ప్రవర్తనాపరమైన మార్పులను గమనించక పోవటం ఫలితంగా జరుగుతున్న నేరాలు, ఘోరాలు దారి తప్పుతున్న బాల్యం వెరసి దాని ఫలితాలు, పర్యవసానాలు సమాజంపై ప్రభావితం చేయటం అందుకే పసి పిల్లల్లో వచ్చే మార్పులను మొగ్గలోనే తుంచివేస్తే ఇలాంటి సంఘటనలు కొంతలో కొంతవరకైన నివారించగల్గిన వారమవుతాము.

ఇక్కడ మరో ఇద్దరు ప్రఖ్యాత వ్యక్తుల గురించి ప్రస్తావించాల్సిన అవసరం ఉందనేది నా అభిప్రాయం ఒకరు ఫ్రెంచ్ తత్త్వవేత్త "జీన్ జాక్ రూసో" మరొకరు "జెఫ్ బెజోష్" రూసో బాల్యంలోనే తల్లిని కోల్పోవడం తండ్రి బాగా మధ్యం సేవించి చిన్న పిల్లవాడైన రూసో చేత  బూతు పుస్తకాలు చదివిస్తూ ఆనంధించేవాడు అలాంటి పరిస్థితుల మధ్య పెరిగి పెద్దవాడై అతను చేసిన రచనలు (సోషల్ కాంటాక్ట్, ది ఎమిలి) ఫ్రెంచ్ విప్లవానికి పరోక్ష కారణాలుగా నిలిచాయని చరిత్ర చెప్పిన సత్యమే కదా. ఇక జెఫ్ బెజోష్ ఇతని తల్లి (జాక్లిన్) యవ్వనంలో ఉన్నప్పుడు ఒక వ్యక్తిని ప్రేమించడం గర్భం దాల్చడం  అతను మోసం చేయడం ఆత్మహత్యకు పూనుకొని విరమించుకోవడం అనంతరం జెఫ్ బెజోష్ జన్మించడం. నేడు అమెరికాలోని సంపన్నులలో బెజోష్ ఒకడు. ఇక్కడ హిట్లర్ ఐనా, కసబ్ ఐనా, రూసో ఐనా, బెజోష్ ఐనా వారి కుటుంబ నేపథ్యాలు వేరు అలానే వారు పెరిగిన విధానం కూడా ఇక్కడ గమనించాల్సిన విషయం.

ఈ మధ్య కాలంలో వచ్చిన బాలివుడ్ లో వచ్చిన "యానిమల్" సినిమాలో బాల్యంలో తండ్రి అశ్రద్ధకు గురైన కథానాయకుడు వికృతంగా ప్రవర్తిస్తూ తన తండ్రిపై ఉన్న ప్రేమతో శత్రువులను (తన బంధువర్గం వారిని) కిరాతంగా చంపుతాడు. ఇందులో హింస మితిమీరిపోయినట్లుగా ఇటీవల జరిగిన పార్లమెంట్



సమావేశాల్లో రాజ్యసభ సభ్యురాలు రజత్ రంజన్ ప్రస్తావించడం ఆలోచించదగ్గ విషయం. ఇక బాక్స్ ఆఫీస్ రికార్డులు సృష్టిస్తున్న రెండో సినిమా ''సలార్'' ఇందులో కూడా హీరో బాల్యంలో జరిగిన హింసాత్మక సంఘటనల వల్ల తల్లి అతడిని (ప్రభాస్‌ను) దూరంగా తీసుకొని పెంచుతుంది. అయిన వాటి నుండి దూరం కాలేక హింస వైపు మళ్ళుతాడు. అంటే మనిషి జీవితంలో బాల్యం ఎంత గొప్పదో ఎటువంటి మలుపులు తిప్పుతుందో అర్థం చేసుకోవచ్చు. గత రెండు సంవత్సరాల నుండి జరుగుతున్న ''రష్యా- ఉక్రెయిన్'' యుద్ధం, ప్రస్తుతం జరుగుతున్న ''హమాస్- హిజ్రాయిల్''పై రెండింటిలో అంతిమంగా నష్టపోయేది చిన్న పిల్లలే. అందుకే పిల్లల్ని బలమైన జాతి సంపదగా ప్రభుత్వాలు గుర్తించి వారి పట్ల అమానవీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలి. ఇటీవలే వెలువడిన ఓ నివేదిక ప్రకారం యుద్ధాలలో మరణించిన పిల్లలు ఇరాక్‌లో గత పద్నాలుగు సంవత్సరాలలో 3100, సిరియాలో పదకొండు సంవత్సరాలలో 12000, యెమన్‌లో గత ఏడు సంవత్సరాలలో 3700, ఉక్రెయిన్‌లో గత ఇరవై ఒక్క నెలల్లో 520, పాలస్తీనాలో మూడు నెలల్లో 12000 పైగా చిన్న పిల్లలు మరణించినట్లు ఆ నివేదిక సారాంశం.

పాలకులు ఎవరైనా కావచ్చు చిన్న పిల్లలు ప్రభావితం అయ్యే హింసాత్మక విధానాలు, ఘర్షణలు, యుద్ధాలు నివారించే ప్రయత్నం చెయ్యాలి. పాలస్తీనాలోనే దాదాపుగా ఎనిమిది లక్షల మంది చిన్న పిల్లలు ఉన్నట్లు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యూనిసెఫ్ అధికారికంగా ప్రకటించింది. అంటే యుద్ధం ద్వారా వారు ఎంతటి మానసిక క్షోభను అనుభవిస్తున్నారో ఆలోచించండి? పాలస్తీనా అయిన, ఉక్రెయిన్ అయిన అఫ్ఘానిస్తాన్ అయిన, సిరియా, టర్కీ, ఇరాన్, ఇరాక్ ఇంకా ఏ దేశమైన కావచ్చు. వారంతా పిల్లలే ఆదిమ సమాజంలో జాతుల మధ్య, మధ్య యుగాలలో మతాల మధ్య, నేడు ఆధిపత్యం కోసం యుద్ధాల ద్వారా పసి పిల్లల్ని చంపడం అనాగరికమైన చర్యగా భావించాలి. బాల్యంలో జరిగే సంఘటనలే పిల్లలపై బలమైన ప్రభావం చూపుతాయి. ఒక్క హిట్లర్ దూకుడు చర్య వల్ల ప్రపంచం మొత్తం నష్టపోతే యుద్ధాలలో పుట్టిన, యుద్ధాల ద్వార నష్టపోయిన పిల్లలు భవిష్యత్తులో హింసాత్మక చర్యలకు పాల్పడి ప్రపంచాన్ని అస్థిర పరిస్తే దానికి భాద్యులం మనం కాదా? అందుకే ప్రపంచ సమాజం ఆలోచించాలి యుద్ధాలు, యుద్ధ వాతావరణం లేని శాంతి సుస్థిర సమాజాన్ని స్థాపించి పిల్లలకు కానుకగా ఇవ్వాలి. అలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలే ప్రయోజకులు అవుతారని పరిశోధనలు తెలియ జేస్తున్నాయి.

# వలస పక్షులు

ఓవైపు జోరున వాన
మరోవైపు హోరున తూటాల తుఫాను
దేని నుండి రక్షణ పొందాలన్నా
కనుచూపు మేర కానరాని ఆసరా

మేమిప్పుడు గాజాలో గాలిదీపాలం
ఎప్పుడు ఆరిపోతామో తెలీదు
ఏ తూటా ఎటువైపు నుండి దూసుకొస్తుందో
ఏ మిస్సైల్ ఎవరి మీద పడుతుందో..

పిల్లలు ఆకలికి అల్లాడుతుంటే
క్షుద్బాధ ఎలా తీర్చాలో
అర్థం కాని అయోమయం


యుద్ధం కోరలు చాస్తున్నకొద్దీ
ఉత్తర గాజా నుండి దక్షిణ గాజాకు
దక్షిణ గాజా నుండి ఉత్తర గాజాకు
వలస పక్షుల్లా మేము-

వలస పక్షి కూడా కొద్ది రోజులు
గూడు నిర్మించుకుంటుంది
మాకు ఆ సౌకర్యమూ ఎండమావే...!

పంజరంలో చిక్కుకున్న పావురం లా
యుద్ధభూమిలో చిక్కుకొన్న మా బ్రతుకులు

ఏ ప్రాణిని కదిలించినా పుట్టెడు దుఃఖం..
కష్టాలను, కన్నీళ్లను కడుపులో దాచుకొని
శాంతి సందేశం కోసం ఆశతో
రేపటి ఉషోదయపు భానుడిలా మేము.

**- డాక్టర్ ముహమ్మద్ హసన్**




**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**మనిషి**లోని లైంగికశక్తి సహజ విషయం. దాన్ని అణచిపెట్ట డాన్ని లేదా దుర్వినియోగ పరచడాన్ని ఇస్లాం అంగీకరించదు. లైంగిక శక్తిని బలవంతంగా అణిచి ఆజన్మ బ్రహ్మచారిగా ఉండి పోవడం నిషిద్ధం కాదు గాని అది అవాంఛనీయం. సహధర్మ చారిణిని వదలి వ్యభిచారానికి పాల్పడటం ఖచ్చితంగా నిషిద్ధమే.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలిపాడు : ''విశ్వాసు లారా! అల్లాహ్ మీ కొరకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువుల్ని నిషేధించుకోకండి'' (5: 87)

**హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం :** ఒకసారి ముగ్గురు వ్యక్తులు దైవప్రవక్త(స) భార్యల ఇండ్లకు వచ్చి దైవప్రవక్త(స) ఆరాధనా పరిస్థితి గురించి అడిగారు. దాన్ని గురించి ఆమె ద్వారా తెలుసుకున్న తరువాత వారు ప్రవక్త(స) ఆరాధనకు మనకు పోలికేమిటి? దైవప్రవక్త (స)కు సంబంధించిన భూత భవిష్యత్ కాలాల పొరపాట్లన్నీ మన్నించ బడ్డాయి అని చెప్పుకున్నారు. అందువల్ల వారిలో ఒకతను ''నేను ఇప్పటి నుంచి ఎల్లప్పుడూ రాత్రి తెల్లవారూ మేల్కొని నమాజు చేస్తుంటాను అన్నాడు. రెండవతను మాట్లాడుతూ, ''నేను ప్రతిరోజు ఉపవాసం ఉంటాను, ఒక్కరోజు కూడా క్రమం తప్పను'' అన్నాడు. మూడవ వ్యక్తి తన నిర్ణయం తెలుపుతూ ''నేను ఈ రోజు నుంచి స్త్రీల జోలికి పోను. ఎప్పటికీ పెళ్ళి చేసుకోను. దైవారాధనకే నా జీవిత మంతా అంకితం చేస్తాను'' అని అన్నాడు.

దైవప్రవక్త(స)కు ఈ విషయం తెలిసి ఇలా అన్నారు : ''ఏమిటి. మీరేనా ఈ మాటలు అంటున్నది. వినండి, నేను మీ అందరికంటే ఎక్కువగా అల్లాహ్‌కు భయపడేవాణ్ణి. మీ అందరికంటే ఎక్కువ దైవభీతి పరాయణుడ్ని అయినప్పటికీ నేను ఉపవాసాలు పాటిస్తున్నాను. వాటిని వదిలేస్తున్నాను కూడా. అలాగే రాత్రిళ్లు నమాజు చేస్తున్నాను, నిద్ర కూడా పోతున్నాను. వివాహాలు కూడా చేసుకున్నాను. గుర్తుంచుకోండి! నా సంప్రదాయాన్ని విడనాడే వాడితో నాకెలాంటి సంబంధం లేదు''. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త(స) హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్ (రజి)ని బ్రహ్మ చారిగా ఉండవద్దని వారించారు. హజ్రత్ సాద్ బిన్ అబీ వఖాస్ (రజి)కు ఈ విషయం తెలిసిన తరువాత మాట్లాడుతూ 'దైవప్రవక్త (స) గనక ఆయన్ని వివాహం చేసుకోకుండా ఉండేందుకు అనుమతించి ఉంటే మేమంతా (కామవాంఛను అణిచే పద్ధతులు అవలంభించి) నపుంసకులుగా మారిపోవడానికి ఇష్టపడే వాళ్ళము' అని అన్నారు. (బుఖారీ)

దైవప్రవక్త(స) ఇలా అన్నారు : ''యువకుల్లారా! మీలో పెళ్ళి చేసుకునే శక్తి కలవారు పెళ్ళి చేసుకోవాలి. పెళ్ళి దృష్టిని కిందికి వాలేలా చేస్తుంది. ఆ శక్తిలేనివారు ఉపవాసవ్రతం పాటించాలి. ఉపవాసం కామవాంఛను అదుపులో ఉంచుతుంది''. (బుఖారీ, ముస్లిం)

సమాజంలో అశ్లీలతను నివారించి సౌశీల్యంతో వాతావరణం నెలకొల్పడానికి వివాహం ఎంతో పటిష్టమైన వ్యవస్థ. వివాహానికి మొట్టమొదటి ప్రేరణ స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, సంతృప్తులే.

అంతిమ దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలిపాడు : ''అల్లాహ్ మీ కోసం మీ జాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు. వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయా దాక్షిణ్యాలు కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక సూచనలున్నాయి. (ఖుర్ఆన్- 30: 21)

# రామమందిరం సరే, రామరాజ్యం ఎక్కడ?



- ఎ.కృష్ణారావు
(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

**బాబ్రీ మసీదు** కట్టడం నేలమట్టం కావడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఈ సంఘటన సంభవించిన డిసెంబర్ 6, 1992 ముందు రోజు రామజన్మభూమి మీడియా సెంటర్ డైరెక్టర్ రమా శంకర్ అగ్నిహోత్రిని కలిసినప్పుడు ఆ కట్టడాన్ని కూల్చివేయ నున్నారని ఆయన సూచన ప్రాయంగానైనా వెల్లడించలేదు (అగ్నిహోత్రి సాధారణ వ్యక్తి కాదు. ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ ఆర్ఎస్ సుదర్శన్‌ను స్వయం సేవక్‌గా మార్చిన వ్యక్తి) ఆ మరునాడు అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ఉమాభారతి, వినయ్ కతియార్, సాధ్వీ రితంబర తదితరులు ఉద్వేగ పూరితంగా, ఉద్రిక్తభరితంగా ప్రసంగాలు చేస్తుండగా కరసేవకులు బాబ్రీ కట్టడాన్ని కూల్చివేశారు. గుమ్మటాలపై ఎక్కినవారు వాటిని కూలుస్తూనే తాము కూడా శిథిలాలతో పాటూ నేల కూలిపోతున్నా ఆ భావోద్వేగంలో వారు లెక్కచేయలేదు. ఆ కట్టడం కూల్చివేసిన స్థలంలోనే మూడు దశాబ్దాల తర్వాత శ్రీరాముడి మందిరాన్ని ప్రారంభిస్తారని నాడు ఎవరనుకున్నారు? ఆ బీభత్స దృశ్యాలూ ఇంకా కళ్లముందు కదలాడుతున్నాయి. దేశ ప్రజలకు ఇవాళ అయోధ్యలో శ్రీరాముడి మందిరం మాత్రమే కనపడవచ్చు. కాని దాని వెనుక ఉన్న చరిత్ర, ఆ చరిత్రలో జరిగిన విధ్వంసం, వందలాది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం గురించి ఇప్పుడెక్కడా చర్చ జరగడం లేదు.

రామమందిరం కోసం నాడు బీజేపీ నేత అద్వానీ రథ యాత్ర జరిపారు. ఈ రథయాత్ర మూలంగా బీజేపీ రాజకీయంగా బలపడింది. 1989 ఎన్నికలతో పోలిస్తే 1991లో బీజేపీ దేశ వ్యాప్తంగా తన ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకున్నది. పార్లమెంట్‌లో రెండవ అతిపెద్ద పార్టీగా ఎదిగింది. ఇవాళ అదే రామమందిరం నిర్మాణం ఘనతను తనకు ఆపాదించుకున్న నరేంద్రమోదీ ఈ మందిరం ఆధారంగా 2024లో మూడోసారి గెలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. శ్రీరాముడు, రామమందిరం బీజేపీ రాజకీయ ఎజెండా మాత్రమేనని ఇవాళ అందరికీ తెలుసు. రామమందిరాన్ని నిర్మించింది ట్రస్ట్ అయితే దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీజేపీ ఎందుకు భావిస్తోంది? రథయాత్ర ప్రారంభించి, బాబ్రీ మసీదు కూల్చివేతను ప్రత్యక్షంగా తిలకించిన అద్వానీకి ఇవాళ ఈ మందిర ప్రారంభోత్సవ ఘట్టంలో ఎక్కడా ప్రాధాన్యత లభించడం లేదు. ప్రధాని మోదీయే ఆ మందిరాన్ని ప్రారంభిస్తున్నారు. మందిర నిర్మాణాన్ని దేశ చరిత్రలో ఒక బృహత్తర ఘట్టంగా జరుగుతోన్న ప్రచారానికి ఆయనే సారథ్యం వహిస్తున్నారు. గత వారం బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆలయ ప్రారంభోత్సవమే ప్రధాన ఎజెండాగా చర్చించారు. ఈ ఆలయ నిర్మాణంలో బీజేపీ ఎలాంటి కీలక పాత్ర పోషించిందీ ఇంటింటికి వెళ్లి వివరించమని మోదీ ఆదేశించారు. రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఆ రోజు ప్రతి భారతీయుడి ఇంటిలో మరో దీపావళి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం మళ్లీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించి జనవరి 22 తర్వాత అయోధ్యలో రామమందిర ప్రారంభం తర్వాత పెద్ద ఎత్తున మందిర్ దర్శన్ అభియాన్‌ను ఎలా కొనసాగించాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా నిర్ణయించారు. మందిర ప్రారంభాన్ని దేశమంతటా ప్రత్యక్ష ప్రసారం ద్వారా కోట్లాది ప్రజలు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కనీసం రెండున్నర కోట్ల మందిని అయోధ్యకు రప్పించి దర్శనం చేయించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి.

ఒకప్పుడు మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడంపై దేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి. రాను రానూ మతాన్ని ఉపయోగించుకోవడం సర్వసాధారణమైపోయింది. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి స్వయంగా 'జై బజరంగ్ బలీ' అని నినాదాలు చేశారు. అధికారంలో ఉన్న పార్టీ బాహాటంగా మతాన్ని ఉపయోగించుకునేందుకు రామమందిర ప్రారంభం ఇప్పుడు స్పష్టంగా ఉపయోగపడుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పుల్వామా, బాలాకోట్ మోదీకి ఆయుధాలుగా మారితే ఈ లోక్‌సభ ఎన్నికల్లో రామమందిరం ప్రధానాస్త్రంగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ప్రజల్లో నెలకొన్న భక్తి విశ్వాసాలను ఒక రాజకీయ పార్టీ తన ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఎంతవరకు సబబు? ఇది ప్రజాస్వామ్యంలో సరైనదేనా? దీనిపై న్యాయస్థానాలు కానీ, ఎన్నికల కమిషన్ కానీ కలుగ చేసుకునే

అవకాశాలు లేవా? అయినా ఇవాళ వ్యవస్థలు స్వతంత్రంగా, విచక్షణాయుతంగా నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎక్కడిది?

బాల్యంలో ఆంజనేయుడి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారం. హనుమంతుడి కథలు విని నడుముకు తోకలాగా ఏదో గుడ్డ తగిలించుకుని ఆడుకునేవారం. రాముడిలా చీపురు పుల్లలతో బాణాలు వేసేవారం. ఎన్టీఆర్ శ్రీరాముడి వేషంతో రాక్షసులను వధిస్తుంటే ఉత్కంఠతో చూసేవారం. సీతారామ కల్యాణం సినిమా టిక్కెట్లకోసం కిక్కిరిసిన లైన్లలో నిలుచున్న దృశ్యం ఇంకా గుర్తుంది. లైబ్రరీలో బాలల బొమ్మల రామాయణం ఆసక్తిగా చదువుకునేవారం. పెద్దలు రామకోటి రాస్తుంటే చూసేవారం. శ్రీరామ నీవే కలవు అన్న అక్షరాలతో అమ్మ నాడు రాసిన ఉత్తరాలు ఇంకా ఉన్నాయి. కాని నాడెవరూ శ్రీరాముడిని రాజకీయాలకు ఉపయోగించుకోలేదు. సీత అగ్నిప్రవేశం, శంబూక వధ లాంటిపై ప్రశ్నలు రేగినప్పటికీ ఒక కథగా రామాయణం ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటుంది. విన్నంతవరకూ, చదివినంత వరకూ శ్రీరాముడు స్థితప్రజ్ఞుడు. సత్యవాక్పరిపాలకుడు. మర్యాద పురుషోత్తముడు. 'విభీషణుడు శరణు కోరితే మీరు అతడికి లంకనే ఇచ్చేశారు. రావణుడు కూడా లొంగిపోయి ఉంటే ఏం చేసేవారు?' అని రాముడిని సుగ్రీవుడు అడుగుతాడు. 'రావణుడే కనుక లొంగిపోతే అతడికి అయోధ్యను కానుకగా ఇచ్చి నా సోదరులతో కలిసి అడవుల్లో నివసించేవాడిని' అని రాముడు జవాబిస్తాడు. నాటి రాముడు అధికారానికి, పదవులకు అతీతుడు. తృణప్రాయంగా పదవిని వదులుకున్నవాడు. కాని రాముడిని రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న నేటి బీజేపీ నేతలు ఎటువంటివారు?

రామరాజ్యం సుపరిపాలనకు సంకేతం అంటారు. రాముడు వేలాది సంవత్సరాల పాటు చేసిన పాలనలో వృద్ధులు యువకులకు అంత్యక్రియలు జరపాల్సిన అవసరం లేదు అని వాల్మీకి యుద్ధకాండలో రామరాజ్యాన్ని వర్ణించాడు. అంటే అకాల మరణాలు ఉండేవి కావని అర్థం. రామరాజ్యం ఎలా ఉండేది? సామాజిక సామరస్యం, న్యాయం వెల్లివిరిసేవి. ఎలాంటి రోగాలు, బాధలు లేకుండా ప్రజలు జీవించేవారు. అసలు ప్రజలు దాన ధర్మాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఉండేది కాదు. అందరూ సమాన హక్కులతో జీవించేవారు. అందరూ విద్యావంతులై ఉండేవారు. శాంతిభద్రతల పరిస్థితి కానీ, అంతర్గత కల్లోలాలు కానీ, ఇతర రాజ్యాల నుంచి సమస్యలు కానీ ఉండేవి కాదు. ప్రజల సంక్షేమం తప్ప రాముడికి వేరేది పట్టేది కాదు. రాజుగా తాను విఫలమైతే అంతకంటే శాపం మరొకటి లేదనుకునేవాడు. ఆదాయం ఎప్పుడూ వ్యయం కంటే ఎక్కువగా ఉండేది. పన్నులు ప్రజలకు ఏ మాత్రం భారం అయ్యేవి కాదు. అంతా సుభిక్షంగా జీవించేవారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా విధానాల రూపకల్పన జరిగేది. రాజ్యం భూలోక వైకుంఠంలా ఉండేదని వాల్మీకి ఒక్క మాటలో వర్ణించారు.

మహాత్మాగాంధీ కూడా శ్రీరాముడు చారిత్రక పురుషుడా కాదా అన్నది పట్టించుకోలేదు. ఆయన రామరాజ్య భావనపైనే దృష్టి కేంద్రీకరించారు. రాజుకూ, పేదకూ సమాన హక్కులున్నాయని రామాయణం చెప్పిందని గాంధీ అన్నారు. '1921లో సరయూ నది ఒడ్డున సాధువులతో గాంధీ రామరాజ్యం గురించి మాట్లాడారు. రాముడు సీతను ప్రేమించినట్లుగా, మనం బలహీనుల్ని కాపాడాలి. కేవలం మన రక్షణ కోసమే రాముడిని ఆరాధించడం పాపం అని స్పష్టీకరించారు' అని ఆర్ఎస్ఎస్ నేత రామ్‌మాధవ్ కూడా ఒక రచనలో పేర్కొన్నారు. మరి ఇప్పుడెలాంటి రాజ్యం ఉన్నది? ఇవాళ ఒక రాజకీయ పార్టీ మతాన్నే తన అస్తిత్వంగా మార్చుకుంది. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం, రైతుల ఆత్మహత్యలు, అధిక ధరలు, బలహీనుల అణచివేతలు, స్త్రీలపై అత్యాచారాలు, కొద్ది మంది సంపన్నులకు దేశ సంపదను ధారాదత్తం చేయడం, కోట్లాది ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిని రక్షించడం. ప్రజలపై భారీ అప్పులు మోపడం, నేతలు అధికారం సంపాదించిన కొద్ది సంవత్సరాల్లోనే వేల కోట్ల ఆస్తులు పోగేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభాగ్యులు సరైన చికిత్స అందకుండా మరణించడం ఎల్లెడలా కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో గంగానదిలో శవాలు తేలిన, అభాగ్యులు మైళ్ల కొద్దీ నడుస్తూ, రైలు పట్టాలపై మరణించిన దేశమిది. ఈ దేశంలో 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇస్తున్నానని ఈ దేశాధినేత చెప్పుకుంటారు. ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' అంటే మోదీ 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన' అంటారు. ఏం తేడా?

ఇక ప్రజల హక్కుల గురించి ఏమి మాట్లాడగలం? పార్లమెంట్‌లోనే ప్రజా ప్రతినిధుల్ని బయటకు గెంటేసి ఇష్టం వచ్చినట్లు బిల్లులను ఆమోదిస్తున్నారు. వాల్మీకి ఒక కవిగా రామరాజ్యం గురించి కవితా గానం చేసి ఉండవచ్చు. కాని నేడు నేతలు అబద్ధాలతో, బూటకపు ప్రచారంలో నిత్యం నిమగ్నమయి ఉన్నారు. ప్రచారం లేకుండా వారికి పూటగడవని పరిస్థితి ఏర్పడింది. భారత రాజకీయాలు ఇప్పుడు సంధి దశలో ఉన్నాయి. అయోధ్యలో శ్రీరాముడి మందిరం ప్రారంభాన్ని వ్యతిరేకించే భారతీయులు తక్కువే కావచ్చు కానీ రామరాజ్యం ఏదీ, ఎక్కడ అని ప్రశ్నించాల్సిన తరుణం ఆసన్నమైంది.

**(ఆంధ్రజ్యోతి జనవరి 3, 2024 సౌజన్యంతో...)**




**రోబోలు అబ్బో అనిపిస్తున్నాయి...** మనిషి చేసే పనులన్నీ అవలీలగా చేయడమే కాదు, మనిషి చేయలేని పనులు కూడా ఎడాపెడా చేసేస్తున్నాయి. యంత్రంతో పోటీలో మనిషి వెనుకబడి పోతున్నాడు.. నోరెళ్ళబెడుతున్నాడు...

రజనీకాంత్ రోబో సినిమా చాలా మంది చూసే ఉంటారు. ఆ సినిమాలో చివరి ఫైట్ సీనులో రోబో చిట్టి రకరకాల రూపాల్లోకి చకచకా మారిపోతుంటుంది. చూస్తున్నవారికి అబ్బో అనిపిస్తుంది. జానపద సినిమాల్లో కామరూప విద్య నేర్చిన మాంత్రికుడిలా రెప్పపాటులో రకరకాలుగా రూపాలు మార్చేస్తుంది.

నిజంగా ఇలాంటి రోబోలు ఉంటాయా? ఉండడమేమిటి, జపాన్ శాస్త్రవేత్తలు తయారు చేశారు. దీనికి డ్రాగన్ రోబో అని పేరు పెట్టారు. ఈ రోబో వివిధ రూపాల్లోకి చిటికెలో మారిపోతుంది. ఈ రోబో నడిచే రోబో కాదు.. ఎగిరే రోబో. అనేక చిన్న చిన్న డ్రోన్‌లతో ఈ రోబోను తయారు చేశారు. ఈ రోబో ఎగురుతూ తన రూపాన్ని మార్చేసుకుంటుంది. ఒక పాములా మారిపోతుంది. ఒక చతురస్రంలా మారిపోతుంది. ఏ రూపంలోకయినా మారిపోయి ఎక్కడికైనా ఎగిరి వెళ్ళగలదు.

చైనాలో సంప్రదాయికంగా ఎగరేసే డ్రాగన్ గాలిపటాలను చూసి ఈ రోబోను తయారు చేశారట. ఈ డ్రాగన్ గాలిపటాల్లో తోక భాగాన్ని చిన్న చిన్న గాలిపటాలతో తయారు చేస్తారు. అలాగే అనేక చిన్న చిన్న డ్రోన్‌లతో ఈ డ్రాగన్ రోబోను తయారు చేశారు. ఎలాంటి ప్రదేశంలోకైనా ఎగురుతూ వెళ్ళగలిగే రోబో ఇది. భవిష్యత్తులో దీన్ని ఒక ఎగిరే హస్తంగా ఉపయోగించాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అలాగే ఎగరడం మాత్రమే కాదు, నేలపై నడవగలిగేలా దీన్ని రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

హాలీవుడ్ సినిమా టర్మినేటర్‌లో రోబో ద్రవరూపంలో ఉంటుంది. ద్రవరూపంలోకి మారి ఆ తర్వాత ఏ రూపంలోకి కావాలంటే ఆ రూపంలోకి వచ్చేస్తుంది.

టెర్మినేటర్ మాదిరిగా విరిగిపోయిన, ముక్కలైనా, కరిగిపోయినా, వస్తువుల మధ్య ఇరుక్కుపోయి కుంచించుకుపోయినా, తిరిగి మామూలు స్థితికి రాగలిగే వినూత్న రోబోలు త్వరలోనే రానున్నాయట. ఇలాంటి రోబోల తయారీకి ఉపయోగపడే ప్రత్యేక పదార్థాన్ని తాము సృష్టించామని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు కొంతకాలం క్రితం ప్రకటించారు. ఒకరకమైన మైనం, నురగను కలిపి చేసిన పదార్థాన్ని సన్నని తీగలకు పూసి దీనిని రూపొందించారు. తీగలకు కరెంటును పంపినప్పుడు మైనం వేడెక్కి ఇది ద్రవస్థితిలోకి మారుతుందని, అలాగే కరెంటును ఆపేసినప్పుడు తిరిగి ఘనస్థితిలోకి మారుతుందని, దీనివల్ల ఈ వస్తువు ఆకారాన్ని మార్చుకోవడంతోపాటు ఎక్కడైనా దెబ్బతింటే కూడా తిరిగి బాగు చేసుకుంటుందనీ పరిశోధకులు చెబుతున్నారు. ఈ పదార్థంతో సూక్ష్మస్థాయి రోబోలను తయారుచేస్తే.. ఆకారం మార్చుకునే లక్షణం వల్ల ఇవి మనిషి శరీరంలో యథేచ్ఛగా తిరుగుతాయని, అందువల్ల వైద్య పరీక్షలకు, చికిత్సలకు ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. కాస్త పెద్దస్థాయి రోబోలను తయారు చేస్తే.. భవనాలు కూలినప్పుడు శిథిలాల సందుల్లోంచి దూరిపోయి బాధితుల సమాచారం తెలుసుకునేందుకూ ఉపయోగపడతాయట. ఈ పరిశోధనలు అమెరికాలోనే కాదు, చైనాలోను, ఇతర దేశాల్లోను జరుగుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ పిట్స్ బర్గ్‌కు చెందిన శాస్త్రవేత్తలు సింథటిక్ పాలిమర్ జెల్‌ను అభివృద్ధి చేశారు. ఇది అంతర్గతంగా లభించే రసాయన శక్తితో చలిస్తూ బాహ్య రూపాన్ని మార్చుకుంటుంది.

ఇది రోబో యుగం. జపాన్‌లోని నాగసాకి సమీపంలో ఒక హోటల్ రోబో స్టాఫ్ హోటల్‌గా గుర్తింపు పొందింది. భవిష్యత్తులో పనులన్నీ రోబోలే చేస్తాయి అనడానికి ఈ హోటల్ మంచి ఉదాహరణ గా నిలుస్తోంది. రిసెప్షన్ డెస్క్‌లో మూడు రోబోలుంటాయి. ఒకటి అమ్మాయి రూపంలో ఉన్న రోబో. రెండోది విచిత్రమైన వేషధారణతో డైనోసార్ రూపంలో ఉంటుంది. మూడో రోబో స్మాల్ ఆండ్రాయిడ్. ఒక రోబో పోర్టర్ లగేజ్‌ను తీసుకెళ్లడంలో సహాయపడుతుంది. నేరుగా రూమ్‌కు తీసుకెళు తుంది. వంద గదులున్న ఈ హోటల్‌లో 140 రోబోలు పని చేస్తున్నాయి. అద్దాలు శుభ్రం చేయడం, గదులు శుభ్రం చేయడం వంటి పనులన్నీ రోబోలే చేస్తుంటాయి. అత్యవసరం సమయంలో సహాయ పడటానికి ఏడుగురు ఉద్యోగులు మాత్రం హోటల్‌లో ఉంటారు. హోటల్ గదులకు తాళాలుండవు. ముఖం చూసి గుర్తించి, తలుపులు తెరుచుకుంటాయి. ప్రతి గదిలో ఒకమూలన టేబుల్‌పై చిన్న రోబో ఉంటుంది. ఈ రోబో గదిలో ఉన్నంత సేపు అతిథులకు కంపెనీ ఇస్తుంది. ఈ రోబో లైట్స్ ఆన్ చేయడం, లైట్లు ఆఫ్ చేయడం వంటి పనులను చేసి పెడుతుంది. వాతావరణ సమాచారాన్ని చెబుతుంది. ఉదయాన్నే లేవడం కోసం అలారంగానూ ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో అన్ని పనుల్లోనూ రోబోలే కనిపిస్తాయంటే చాలా మంది నమ్మలేదు. కానీ ఈ హోటల్ ప్రారంభమయ్యాక నమ్మాల్సిన పరిస్థితి వచ్చిందని అంటున్నారు. రోబోల మూలంగా రాబోయే పదిహేనేళ్లలో యూరప్‌లో కోటి ఉద్యోగాలు పోతాయని ఒక సర్వేలో వెల్లడయింది. ఇలాగే చైన్నైలో కూడా ఒక హోటల్లో రోబోలు పనిచేస్తున్నాయి. దేశంలోనే మొట్టమొదటిసారి రోబోట్ రెస్టారెంట్‌ను తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై నగరంలో ప్రారంభిం చారు. రోబోట్‌లే వెయిటర్లుగా మారి ఇంగ్లీషు, తమిళ భాషల్లో ఖాతాదారులతో మాట్లాడుతూ ఆహార పదార్థాలను వడ్డిస్తున్నాయి.

అచ్చం మనిషిలా వ్యవహరించే రోబో పేరు సోఫియా. ఇది సౌదీ అరేబియాలో ఉంది. అక్కడ ఈ రోబోకు పౌరసత్వం కూడా ఉంది. యంత్రంలా పనిచేసే మనుషుల స్థానంలో... మనిషిలా పని చేసే యంత్రాలు రావడం మానవ నాగరికతలో గొప్ప విప్లవం. షాపుకెళ్ళి కూరగాయలు తెమ్మంటే, జాగ్రత్తగా మంచివి ఏరి బేరం చేసి మరీ తీసుకొచ్చే రోబోట్లు భవిష్యత్తులో వచ్చినా ఆశ్చర్యం లేదు.

సౌదీ అరేబియా ఒక రోబోట్‌కు పౌరసత్వం ఇస్తే, జపాన్ మరో రోబోట్‌కు రెసిడెన్సీ సర్టిఫికేట్ ఇచ్చింది. అంటే టోక్యోలో నివాసం ఉండడానికి అనుమతి పత్రం. ఈ రోబో పేరు షిబుయా మిరాయ్. ఏడేళ్ళ పిల్లవాడిలా కనబడే రోబోట్. అధికారికంగా నివాస ధృవీకరణ పత్రం పొందిన తొలి రోబో 'షిబుయా మిరాయ్'. మిరాయ్ అంటే జపనీస్ భాషలో భవిష్యత్ అని అర్థం. మనం ఏదైనా మెసేజ్ పంపితే దానికి తిరిగి జవాబిస్తుంది ఈ రోబో. ఫోటోలు తీయడం దీని హాబీ జనంతో మాట్లాడం ఇష్టం. అదీ, ఇది అని కాదు ఏ విషయం గురించి అయినా మాట్లాడతాడి బుడత రోబో.

కేవలం నిర్దిష్టమైన పని చేసే రోబోట్లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉన్నవి కావు. సంక్లిష్టమైన పనులు, ఆలోచన అవసరమైన పనులు చేయగలిగిన రోబోట్లలోనే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉంటుంది. సోఫియా అలాంటి రోబో. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అంటే కేవలం మెషిన్ లెర్నింగ్ మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువగా విశ్లేషణ, ఆలోచనలతో కూడిన పనులు చేయగలిగిన సామర్థ్యం.

చంద్రుని భౌగోళిక పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసేం దుకు అక్కడ ఓ రోబో స్టేషన్‌ని ఏర్పాటు చేయాలని చైనా ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ స్టేషన్ వల్ల అక్కడి శాంపిల్స్‌ను భూమ్మీదికి తీసుకొచ్చే అవసరం లేకుండా అక్కడే పరిశోధించే అవకాశం ఏర్పడుతుందని పీకింగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జియోవీక్సిన్ తెలిపారు. ఒక సోలార్ పవర్ జనరేటర్ ను కూడా అక్కడ ఏర్పాటు చేస్తే రోవర్ల అవసరం లేకుండానే చంద్రుని భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేయవచ్చు. ఈ ప్రయోగానికి సంబంధించి మొదటి క్యారియర్ రాకెట్‌ను 2030లోగా పంపేం దుకు చైనా సిద్ధమవుతోంది.

అత్యవసర సమయాల్లో సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసేందుకు ఇజ్రాయిల్ శాస్త్రవేత్తలు బృందం RSTAR అనే కొత్త రోబోట్‌ను తయారు చేశారు. ఈ రోబోట్ అవసరాన్ని తగ్గట్టు ఆకారం మార్చుకుని పనిచేస్తుంది. కఠినమైన స్థలాలకు చేరుకోగలదు. ప్రకృతి వైపరీత్యాలలో సహాయక చర్యలకు ఉపయో గపడుతుంది. అలాగే రోబో మిడతలను తయారు చేశారు. ఇవి ఎక్కడికైనా వెళ్ళగలవు. రెస్క్యూ కార్యక్రమాల్లో ఉపయోగపడగలవు. డ్రోన్ల కన్నా ఉపయోగకరంగా ఉంటాయి.

రోబో ఈగలు కూడా వచ్చేస్తున్నాయి. ఇప్పటిదాకా మీరు ఎగిరే రోబోలను చాలా వాటినే చూసుంటారు. కాని ఇప్పుడు అత్యంత చిన్న రోబోలు వస్తున్నాయ్. రాజమౌళి ఈగ లాగా రోబో ఈగలు మార్కెట్లో త్వరలో హల్ చల్ చేయనున్నాయి. మరి ఇంత చిన్నగా ఉన్న ఈ రోబోలకు రోబో ఈగగా నామకరణం చేశారు. భవిష్యత్‌లో మరింత మెరుగైన ఈ డ్రోన్ల రూపకల్పనకు ఈ డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెబుతున్నారు. శాస్త్రవేత్తలు ఇప్పటిదాకా ఒక చోటు నుంచి మరోక చోటుకి పోయే రోబోలను మాత్రమే తయారుచేశారు. గాలిలో అలాగే ఉండిపోయే

**మిగతా 34వ పేజీలో...**

కథ

- షహనాజ్ బేగం, అనంతపురం



# కాలం మారుతోంది

**సమయం** రాత్రి ఒంటి గంట దాటింది. అందరూ నిద్రపోయే వేళ. నసీమా బేగంకు అప్పుడే మెళకువ వచ్చింది. చలికాలం అందులో డయాబెటిక్ పేషంట్ కావటంతో వెంటనే బాత్‌రూమ్‌కు వెళ్ళాలనిపించింది. లేచి బాత్‌రూమ్ వైపు నడిచింది. ఆమెకు డెబ్బై ఏళ్ళ వయస్సుంటుంది.

ఆమెకు ప్రక్క గదిలోనుంచి ఏవో మాటలు స్మార్ట్ ఫోన్లోనుంచి వస్తున్న కాంతివంతమైన వెలుగు కన్పించసాగాయి. ఆ గదిలో ఆమె మనవరాళ్లిద్దరు ఉంటారు. ఇంత రాత్రి వేళల్లో ఆ పిల్లలకు ఫోన్లతో ఏమి పని. పిల్లలంటే చిన్న పిల్లలు కాదు. యుక్త వయసులో ఉన్న పిల్లలు. కాలేజీ చదువులు చదువుతున్న అమ్మాయిలు.

నసీమా బేగంలో ఆందోళన, భయం కలగసాగాయి. బాత్‌రూం నుంచి తిరిగి వస్తూ ఆ గది వంక చూసింది నసీమా బేగం. ఆ గది తలుపులు మూసి ఉన్నాయి.

రాత్రి, తెల్లవారుజాము వరకు ఫోన్లలో ఛాటింగ్‌లు, ఇన్‌స్టాగ్రామ్‌లు, ఫేస్‌బుక్‌లతో పూర్తి ప్రపంచమే చుట్టి వచ్చేస్తారు. అందులో ఎక్కువగా విజ్ఞానదాయకమైన విషయాలు ఉండవు గానీ అన్న లజ్జాకరమైన విషయాలే. ఎంజాయ్‌మెంట్ పేరిట ఎన్నో హేయమైన విషయాలు జరిగిపోతుంటాయి.

అప్పటికీ చాలాసార్లు పెద్దరికం వహిస్తూ అలాంటి విషయాల నుండి దూరంగా ఉండాలని హెచ్చరించింది. కానీ లాభం లేకపోయింది. పైగా వాళ్ళు తనతో మాట్లాడటం మానేసి దూరంగా ఉండసాగారు. వారి తల్లిదండ్రుల దృష్టికి తెస్తే, 'అమ్మా! ఈ కాలం పిల్లలను అదుపు చెయ్యలేము. మా కాలంలో పెద్దవారు దండిస్తే మా తప్పులను సరిదిద్దుకునేవాళ్ళం. కానీ ఇప్పటికాలం పిల్లలు వినే రకం కాదు. పైగా ఏ అఘాయిత్యానికి పాల్పడు తారోననే భయం కలుగుతున్నది. పిల్లల మాటలను మనం పెద్దవాళ్ళం వినే పరిస్థితి వచ్చింది. వాళ్ళు చేస్తున్న తప్పులను చూసీచూడనట్లు గడుపుతున్నాము. లేదంటే వాళ్ళు ఏ అఘాయిత్యమైనా చేసుకుంటే మనం తట్టుకోగలమా? రోజూ ఇలాంటి సంఘటనలను వార్తా పత్రికలలో చూడ్డం లేదూ.. అందుకే వారిని ఏమీ అనలేక వారి కోరికలను తీరుస్తూ బ్రతుకు తున్నాము. అని నిస్సహాయతను చాటుకున్నారు వాళ్లు. వారి మాటల్లో ఆవేదన కన్పించింది. వాళ్ళు నిజమే పలుకుతున్నారు అనిపించింది. కాలప్రభావం, పరిసరాల ప్రభావం ఆ పిల్లలపై ఎంతో ఉంది. అమ్మో ఈ కాలపు పిల్లలను కట్టడి చెయ్యలేము అనే భావన వారిలో కన్పించింది.

ఆ కన్నవాళ్ళ మానసిక పరిస్థితి అర్థమయ్యింది.

❖❖❖

అలా రాత్రిళ్లు అర్ధరాత్రి దాటేవరకు స్మార్ట్ ఫోన్లతో గడిపిన ఆ అమ్మాయిలు తిరిగి ఉదయం కాలేజీకి వెళ్ళేవరకు నిద్రపోయే వారు. తరువాత లేచి ఆదరాబాదరగా తయారై కనీసం స్నానం, బ్రేక్‌ఫాస్ట్ చెయ్యకుండానే వెళ్ళిపోయేవారు.

వారిలో ధార్మిక, ఆధ్యాత్మిక చింతన కొరవడింది. పెరిగే కొద్దీ కన్న వారితో బంధాలు, అనుబంధాలు గట్టిపడాలి గాని వారు ఎందుకో దూరమవుతున్నట్లు కనిపిస్తోందని గ్రహించారు నసీమా బేగం.

అంతేకాదు మానవీయ విలువలు తెలియవు వారి క్రమశిక్షణా రాహిత్యం ఆమెను కలవరపర్చింది. కాలానుగుణంగా వారిలో మార్పు రావచ్చునేమోనని ఆశించడం సహజం.

ఇలాగే రోజులు, నెలలుగా, నెలలు సంవత్సరాలుగా దొర్లిపోయాయి. మనవరాళ్ళు ఇష్రత్, నుస్రత్‌ల చదువులు పూర్తయిన తరువాత వారి వివాహాలు చెయ్యడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఆ ఇంట్లో వారి పెళ్ళి గురించి ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. ఏ సంబంధం వచ్చినా తిరస్కరించేవారు. ఎన్నో వంకలు పెట్టేవారు. గడ్డం పెంచుకుని ధార్మికంగా కనిపించిన వరుణ్ణి అస్సలు ఇష్టపడేవారు కాదు. తమ పెళ్ళిళ్లు తమ ఇష్టపూర్వకంగానే జరగాలని పట్టుబట్టారు.

చివరికి ఎలాగయితేనేం వారు ఇష్టపూర్వకంగా ఇష్టపడినవారినే ఇచ్చి వారికి నచ్చిన విధంగా పెళ్ళిళ్ళు జరిపించారు కన్నవాళ్ళు.

నసీమా బేగం లోలోన భయం భయంగా ఉంది. ఇక్కడ తమ ఇష్టపూర్వకంగా వ్యవహరించిన ఆ అమ్మాయిలు అత్తవారింట్లో ఎలా వ్యవహరిస్తారోనని.

ఆమె భయపడినంత పనీ అయ్యింది. పెద్దపిల్ల ఇష్రత్ ఒకరోజు ఏడుస్తూ తన బట్టలు, వస్తువులు సర్దుకుని వచ్చేసింది. కారణం అడగ్గా చెప్పిన విషయమేమిటంటే ఆమె ధరించే దుస్తులు అక్కడ ఎవరికీ నచ్చవట. ఇలా టాప్‌లు, షార్ట్‌లు, ప్యాంట్ ధరించడానికి వీల్లేదని అత్తగారు ఖరాఖండిగా చెప్పేశారట. బయటకి వెళ్ళేటప్పుడు బురఖా ధరించాలని ఆదేశించారట. ఈ విషయం గురించి ఇంట్లో రోజూ గడవలేనట. ఇక అక్కడ ఉండలేక వచ్చేసిందట. తన భర్త నుండి ఖులా తీసుకోవడానికి నిశ్చయించుకుందట.

తన ఇష్టం వచ్చినట్టు జీవించే హక్కు తనకుందని, తను ఎలాంటి బట్టలు వేసుకోవాలో తనే నిర్ణయిస్తుందని వాళ్ళెవరు నన్ను అడ్డగించడానికి.. తన వ్యక్తిగత విషయాలలో జోక్యం చేసుకోకూడదని అక్కడ బాగా హెచ్చరించి వచ్చిందట. అక్కడికి తిరిగి వెళ్ళే ప్రసక్తే లేదని తెగించి చెప్పేసింది.

ఎప్పటిలాగానే ఆ అమ్మాయికి ఎదురు చెప్పలేకపోయారు ఆమె తల్లీ తండ్రి. తాము వ్యతిరేకంగా మాట్లాడితే దాని పర్యవసానం ఎలాగుంటుందో? ఇంట్లో నుంచి వెళ్ళిపోయి బయట బ్రతుకుతానంటే? లేదా ఏ అఘాయిత్యానికి పాల్పడితే? ఆ దారుణం ఎలా చూడాలి? వారిని మరింత కృంగదీస్తున్న విషయమేమిటంటే ఆ అమ్మాయి గర్భవతి. నెలలు నిండుతున్నాయి.

రెండో అమ్మాయి నుస్రత్ కూడా అక్కలాగానే భర్తతో తెగదెంపులు చేసుకుంటానంటూ పెట్టేబేడాతో తిరిగి వచ్చేసింది. అక్కడ ఇంటి పనులలో తీరిక దొరకడంలేదట. ఫోన్లలో ఛాటింగ్ చెయ్యడానికి, ఇన్‌స్టాగ్రామ్ వంటివి చూడటానికి వీలు పడటంలేదట. ఫోన్‌తో కన్పిస్తే భర్త కోప్పడుతున్నాడట. తన గురించి పట్టించుకోవడం లేదని గొడవ పడుతున్నారట. ఇలా ఎన్నో చెప్పింది.

ఇదంతా చూసి నసీమా బేగం మౌనంగా ఉండలేకపోయింది. సమయం లభించినప్పుడల్లా వారిద్దరిని కూర్చోబెట్టుకుని నీతిదాయకమైన మాటలు చెప్పేది.

ఆ సృష్టికర్త ఆడదాని శరీరాన్ని ఒంపుసొంపులతో తయారుచేశాడని, కొన్ని భాగాలను తప్పనిసరిగా దాచుకునే పరిస్థితి ఏర్పడిందని, అందులో కడుపుతో ఉన్నప్పుడు బిగుతైన బట్టలు ధరించరాదని, అందుకే మీ అత్తయ్య అలా చెప్పి ఉంటుందని, మనకు కొన్ని హద్దులున్నాయని, వాటిని అతిక్రమించి జీవిస్తే దాని పర్యవసానం చాలా చెడ్డగా ఉంటుందని చెబుతూ కుటుంబ విలువల గురించి, వివాహ వ్యవస్థ గురించి ఎంతో గొప్పగా చెప్పింది. కొంత ఓర్పు, సహనంతో జీవితాన్ని సాగిస్తే దాని ప్రతిఫలం చాలా గొప్పగా ఉంటుందని చెబుతూ చిన్న చిన్నవిషయాలను పెద్దదిగా చేసి భర్తతో ఖులా తీసుకుంటారో ఆ స్త్రీల గురించి హదీసులో ఏముందో తెలుసా? వారిపై స్వర్గం సువాసన కూడా నిషిద్ధం అట. వారు కపట విశ్వాసులు అట. ఆ దైవానికి భయపడాలి. పెళ్ళయిన ప్రతి అమ్మాయి తన కొత్త జీవితంలో అడుగు పెట్టినప్పుడు అంతా అస్తవ్యవస్తంగానే ఉంటుంది. ఒక మొక్కను తీస్కెళ్ళి మరోచోట నాటినప్పుడు అది తిరిగి చిగురించటానికి కొంత సమయం పడుతుంది. మీ జీవితాలు కూడా అలాగే మెల్లగా సర్దుకుంటాయి. కొంత ఓర్పు, సహనం పాటించాలి. జీవితంలో రాజీపడాలి. మన పెద్దలు ఎన్నో త్యాగాలను చేస్తేనే మనం ఇలా గౌరవప్రదంగా జీవిస్తున్నాము. ఇలా తనకు తోచిన ఎన్నో విషయాలను చెప్పింది. ఆ అమ్మాయిలు పునరాలోచించుకోసాగారు. వారిలో ఏదో మార్పు రాసాగింది.

ఆ అమ్మాయిల్లో ఏదో మార్పు వస్తున్నట్లు గ్రహించిన నసీమా బేగం తన మాటలను కొనసాగించింది. 'అదీగాక మీరు తల్లులు కాబోతున్నారు. మాతృత్వం అంటే ఒక వరం. మీ కడుపులో ఉన్న బిడ్డల్ని అన్యాయం చేయకండి. వారిని తండ్రి ప్రేమ నుండి దూరం చెయ్యకండి. మీరు మరో వ్యక్తిని వివాహమాడినా ఇంత కంటే మంచి జీవితం ఉండదని తెలుసుకోండి. ఇప్పటికయినా మించి పోయిందేమీ లేదు. మీ కాపురాలను సరిదిద్దుకొని సుఖప్రదమైన జీవితాన్ని కొనసాగించండి. మేము పెద్దవారము ఇంతకంటే ఎక్కువ కష్టాలను భరించాము. అవమానాలను ఎదుర్కొన్నాము. సంపూర్ణ దాంపత్య జీవితాన్ని గడిపి గౌరవ ప్రదంగా బ్రతుకుతున్నాము. మీకు ఇదే నా సలహా, ఉపదేశం. మన పూర్వ పుణ్యస్త్రీమూర్తులను వారి జీవితాలను తెలుసుకుని అనుసరించండి.... చెప్పటం ముగించింది. ఆ అమ్మాయిల కళ్ళు వర్షిస్తున్నాయి. తమ తప్పులు తెలిసి వచ్చినట్లు.

# అక్షర సూరీడు

ఖాసీంవలి




**అదీ** తొంభైయ్యవ దశకం. కడప జిల్లాలోని సగిలేటికి సమీపంలోని ఓ చిన్న గ్రామం అది. బ్రతుకులు భారంగా వెళ్లదీస్తున్న అడవి బిడ్డలు (యానాదులు) నివాసం ఉంటున్న ప్రదేశం అది. నవీన నాగరికత, సంస్కృతులకు వీళ్ళు ఆమడ దూరంలో ఉంటారు. సీమ కంప చెట్లను నరికి, వాటిని బట్టీలలో పేర్చి బొగ్గులుగా చేసి, వాటిని మూటల్లో కట్టుకొని వాళ్ళే స్వయంగా మోసుకెళ్లి, సమీపంలోని పట్టణంలో అమ్మి దాంతో వచ్చిన ఆ పదో, ఇరవై తోని వాళ్లకి కావాల్సిన నిత్యావసర సరుకులు కొనుక్కొని జీవితం గడిపేటోళ్ళు. చదువు, సంధ్యలు అంటే అవి వాళ్ళకి చెందినవి కావని నమ్మేటోళ్ళు. జంతువుల వేట, బొగ్గులు కాల్చడం మాత్రమే వీళ్ళకి తెలిసిన విద్యలు. అంతే కాదు తేలు, పాముల్లాంటి విష పురుగులు హాని తలపెట్టిన సందర్భాల్లో వీళ్ళు తమ అద్భుతమైన నాటు వైద్యంతో నయం చేసేటోళ్లు. నవ మాసాలు పూర్తి చేసుకున్న గర్భిణీ స్త్రీలకు కాన్పులు కూడా చేసేటోళ్లు. నిజంగా వాళ్ళను చూస్తే ఈనాడు పని చేస్తోన్న డాక్టర్లకు ఏ మాత్రం తీసుపోరని అనిపిస్తుంది.

అప్పట్లో అక్షర రశ్మి, అక్షర సంక్రాంతి లాంటి ఎన్నో చైతన్య కార్యక్రమాలు జరిగాయి. రాత్రిపూట ఏ అరుగు మీదనో, చెట్టు క్రిందనో, పూరి గుడిసెలోనో కూర్చోబెట్టి, మట్టి పలకలు, ఒక పుస్తకం ఇచ్చి నిరక్షరాస్యుల్ని అక్షరస్యులుగా చేసే ప్రయత్నం అయితే ప్రభుత్వం చేసింది. కానీ అడవి బిడ్డల విషయంలో అది సఫలీకృతం కాలేదనే చెప్పొచ్చు. ఎందుకంటే వీళ్ళు సంచార జీవితం చేస్తూ, వలసలు వెళ్లి వస్తుంటారు. ఎక్కడ కర్ర బొగ్గు బాగా లభ్యమవుతుందో అక్కడ కొద్ది రోజులు గడుపుతారు. అక్కడ కర్రబొగ్గు పూర్తిగా అయిపోతే తిరిగి వేరే చోటికి వలసలు వెళతారు. ఇట్లా ఓ దశాబ్దం గడిచింది.

ఒక రోజు అడవి బిడ్డలు ఉంటోన్న ఆ కాలనీలోకి ట్రింగ్, ట్రింగ్ అని బెల్లు మోగిస్తూ వచ్చి ఒక సైకిలు ఆగింది. అక్కడ ఆడుకుంటోన్న పిల్లలలో లింగమ్మ అనే ఒక అమ్మాయి ఆ సైకిలు మీదున్న వ్యక్తిని చూసి, కాస్త బెరుకుతో అక్కడి నుండి పరుగు లంకించుకొని తన ఇంటికెళ్లి అమ్మ, అయ్య లకు ఎవరో కొత్త మనిషి కాలనీలోకి వచ్చాడని సమాచారం ఇచ్చింది. వెంటనే లింగమ్మ తల్లి దండ్రులు, మిగిలిన కుటుంబాల వాళ్లు బయటికి వచ్చి చూశారు. అక్కడ సైకిలు పట్టుకొని, సూటు ధరించి నడి వయస్సులో ఉన్న ఒక ఆయన్ని వారు చూశారు. సహజం గానే కొత్త వాళ్ళను చూసినపుడు అడవి బిడ్డలు కాస్త భయాందోళనలకు లోనవుతారు. అందుకే అందరూ ఆయన్నే తదేకంగా చూస్తుండి పోయారు. అయితే లింగమ్మ తల్లి పెంచలమ్మ మాత్రం కాస్త గుండె దిటవు చేసుకొని, స్వరాన్ని కాస్త సవరిస్తూ మీరెవరు బాబయ్యా! అని అడిగింది. అప్పుడు సైకిల్ స్టాండు వేస్తూ, అమ్మా! నా పేరు దాదాపీర్. ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. మీకు చదువు సెప్పమని ప్రభుత్వం మీకాడికి పంపింది. ఇక మీదట నేను ప్రతి రోజూ మీ కాలనీకి వచ్చి చదువు సెబుతానన్నాడు.

సూర్యోదయానికి ముందే లేచి చద్ది కట్టుకొని సగిలేటి గట్టుకు వెళ్లి అక్కడ కర్ర బొగ్గు కొట్టి కొట్టి అలసి, సొలసిన దేహాలతో మళ్ళీ ఎప్పుడో చీకటి పడ్డాక ఇళ్లకు వచ్చేటోళ్ళు. మూడు పూటల భోజనం అంటే వాళ్లకు అది కుదిరే పని కాదు. అయినప్పటికీ వాళ్ళల్లో ఎక్కువ మంది ఎనభై ఏండ్లు పైబడి బతికేటోళ్ళు. బోద కొట్టాలే వారికి పెద్ద అపార్ట్మెంట్లు. విద్యుత్ సరఫరా లేదు. కిరసనాయిలు బుడ్డీలే లైట్లు. అదీ కొనే స్థోమత లేనోళ్ళు చిమ్మ చీకట్లోనే నేలపై పరుండేటోళ్ళు. ఒక్కోసారి నేలపై వాళ్ళతో బాటు పడుకున్న పసి కందులు విధి వక్రీకరించి ఏ విష సర్పం కాటుకో బలై ప్రాణాలు కోల్పోయిన దాఖలాలు లేక పోలేదు. వీళ్ళను చూసినప్పుడు జీవితం అందరికీ ఒకటే కాదనిపిస్తుంది.

వెంటనే దాదాపీర్ సదువు కోవడం వల్ల కలిగే లాభాలు ఏంటో వాళ్లకి అవగాహన కల్పించి, వారిలోని ఆత్మ న్యూనతా భావాల్ని పోగొట్టే ప్రయత్నం చేశారు. ఆ కాలనీ వాసులకు మూల పురుషుడు, సుమారు వందేళ్ళు పూర్తి చేసుకున్న రామయ్య తాత కలగజేసుకొని దాదాపీర్ మాటలకు జై కొట్టాడు. ఇంకేముంది ఆ మరుసటి రోజు నుండి కాలనీలోని ఒక వేప చెట్టు క్రింద అడవి బిడ్డలకు విద్యా బోధన మొదలెట్టారు మాస్టారు గారు. పైకి సంతోషంగా ఉన్న లోన ఏ మూలనో కాస్త వెలితి చోటు చేసుకుంది దాదాపీర్ మదిలో. కొందరు పిల్లలు సక్రమంగా బళ్ళోకి రాకపోవడం ఆయన గమనించాడు. అడవి బిడ్డలందరినీ బళ్ళోకి తీసుకురావడం ఎలా? అని ఆలోచించి, కాలనీ లోని ప్రతీ ఇంటికి తిరగడం మొదలెట్టాడు. పిల్లలు ఎందుకు బడికి సక్రమంగా రావడం లేదో కారణాల్ని అడిగి తెలుసుకున్నాడు.

సగిలేటి ఒడ్డున ఏ అడవిలోనో ఉండేటోళ్ళం. బొగ్గు కర్ర వాసన తప్ప మరేమీ ఎరుగనోళ్ళం. సదువు సంధ్యలు మా కెందుకు సారూ! అంటూ అవతలి వైపు నుండి తిరుగు సమాధానం వచ్చింది.

ఒక పేద కుటుంబ నేపథ్యంలో నుండి ఉపాధ్యాయ వృత్తి లోకి అడుగు పెట్టిన దాదాపీర్ మాస్టారుకి చదువు విలువ ఏంటో బాగా తెలుసు. "చదువే పేద వాడి బ్రహ్మాస్త్రం" అని బలంగా నమ్మినోడు. "అక్షరం సూర్యుడయితే అది అందరికీ వెలుగు నివ్వాలనేది ఆయన ఆలోచన. అక్షరాల్ని ఆరిపోని దివ్వెలుగా పిల్లల దోసిళ్లలో పోసి, ఆ వెలుగులు బడి గదినే కాకుండా పరిసర సమాజాన్నంతటినీ వెలిగించాలని ఆయన కల."

అయితే కొందరి సమాధానాలు విని దాదాపీర్ హృదయం చివుక్కుమన్నది. అడవి బిడ్డలకు ఉదయం తినడానికి ఏమీ ఉండేది కాదు. అందుకనే వాళ్లు బడిలోకి రాలేక పోయేటోళ్ళని దాదాపీర్ గ్రహించారు. దీనికోసం దాదాపీర్ తన స్వంత ఖర్చులతో యానాదుల బిడ్డలందరికీ ప్రతి రోజూ ఒక అరటిపండు ఇచ్చేటోడు. అంతే గాకుండా బలపాలు, పెన్నులు, పలకలు, నోటు బుక్కులు వగైరా వారికి ఉచితంగా ఇచ్చేటోడు. ఇక అడవి బిడ్డల కు కొండంత అండ దొరికింది, ఫలితంగా బళ్ళో పిల్లల సంఖ్య కూడా మరింత పెరిగింది. పిల్లలకు దాదాపీర్‌పై ఎంతో ప్రేమ, అభిమానం వెల్లి విరిశాయి. తమ బిడ్డలకు సదువు నేర్పడానికి దాదాపీర్ చేస్తున్న ప్రయత్నం అడవి బిడ్డలు గమని స్తూనే ఉన్నారు. త్వరలోనే వాళ్లు దాదాపీర్ గారిని తమలో ఒకనిగా భావించారు. తమ కష్టాలను, నష్టాలను ఆయన వద్ద సెప్పుకుండే టోళ్ళు. అలా నెమ్మది నెమ్మదిగా దాదాపీర్ పిల్లలతో పాటు పెద్దలకు కూడా రాత్రిపూట బడి నిర్వహించడం మొదలెట్టారు. "పూటకో అక్షరం" అనే నినాదంతో స్త్రీలు, వృద్ధులు కూడా రాత్రిపూట బళ్ళో సదువుకొని అక్షర జ్ఞానం పొందాలని ఆయన కోరిక. సదువుతో ఈ ప్రపంచాన్నే మనం గెలవ వచ్చని ఆయన వారితో పదే పదే సెప్పేటోడు.

ఇలా ఆయన సుమారు 12 సంవత్సరాలు ఆ కాలనీలోని అడవి బిడ్డలపై కృషి చేశారు. 12 ఏళ్లలో ఒక్క పూట కూడా సెలవు తీసుకోకుండా పనిచేశారు. అలాగే ఒక రోజు కూడా బడికి ఆలస్యంగా వచ్చేటోడు కాదు. ఎప్పుడైనా ఆలస్యం అయితే ఆరోజు జీతం కట్ చేయించుకోవడానికి ఒక నియమం పెట్టుకు న్నాడు. అదే నిమిషం నిబంధన.ఇలా తన వృత్తిపట్ల ఉన్న నిబద్ధత, అంకితభావం వల్ల తన జీవితంలో ఎన్నో ఆనంద క్షణాలను కోల్పోయాడు. పెళ్లిళ్ల లాంటి శుభకార్యాలకు కూడా వెళ్లేటోడు కాదు. దీనితో బంధువుల వర్గం నుండి వ్యతిరేకత వ్యక్తం అయింది. అయినా సరే ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాలేదు. నేను తీసుకుంటున్న ప్రతి పైసాకు నేను జవాబుదారిని అని చెప్పేటోడు. అందువలనే ఆయన వద్ద చదువుకున్న వాళ్ళు ఇవాళ ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఆయన వారికి చదువు చెప్పడంతో పాటు పర్యావరణ-పరిరక్షణ, పచ్చదనం-పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిత్యం అవగాహన పరిచేటోడు. అంతేకాకుండా వారికి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించి పొగరహిత కాలనీగా మార్చాడు. మును పెన్నడు బ్యాంకులకు వెళ్ళని అడవి బిడ్డలకు ఉచితంగా బ్యాంక్ అకౌంట్లు తెరి పించాడు. కరోనా కష్టకాలంలో తమ జీవన ఉపాధి కోల్పోయి నానా ఇబ్బందులు పడుతున్న అడవి బిడ్డల గోడును చూసి చలించి పోయాడు.

అమెరికాలో ఉంటున్న ఒక ఎన్ఆర్ఐ ఫణి రాజకుమార్ గారి ఆర్థిక సహాయంతో వారికి బియ్యం ప్యాకెట్లు, నూనె, పప్పు దినుసులు, కూరగాయలను సమకూర్చి వారిని ఆదుకున్నాడు. వారి కుటుంబ సభ్యుడయ్యాడు. వారింట్లో భోజనం చేశాడు. వారి బిడ్డలతో ఆడుకున్నాడు. అడవి బిడ్డలు మెచ్చిన గొప్ప గురువయ్యాడు. ఇలా దాదాపీర్ మాస్టారు గారు అంచలంచెలుగా జిల్లా, రాష్ట్ర ఉత్తమ అవార్డులతో పాటు మరెన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా అప్పటి మన భారత రాష్ట్రపతి గారైన శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారి చేతుల మీదుగా రాష్ట్రపతి అవార్డును స్వీకరించారు. ప్రతి పేదింటి బిడ్డ ముఖ్యంగా అడవి బిడ్డలు చదవాలని చదువుతోనే దేశ ముఖచిత్రం మారుతుందని ఆకాంక్షించాడు. జనహితమే తనహితమని నమ్మాడు. ఓ అలు పెరగని బాటసారిలా, అక్షర దీపాలను వెలిగించే సూర్యునిలా తన బాటలో పయనం కొనసాగిస్తూ వెళుతున్న దాదా పీర్ మాస్టారు మనందరికీ స్ఫూర్తిదాయకం.

29వ పేజీ తరువాయి...

రోబోలను తయారుచేయలేదు. అయితే ఇప్పుడు రానున్న ఈ ఈగ రోబోలు కొంతకాలం పాటు గాలిలో నిశ్చలంగా ఉండేందుకు చాలా బాగా ఉపయోగపడాతయని చెబుతున్నారు.

ఈగలు మిడతలే కాదు రోబో కుక్కలు కూడా వచ్చేస్తున్నాయి. ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్ రోబో కుక్కను తయారు చేసింది. ఈ రోబో కుక్క ఓ చిన్న కుక్క పిల్లను మచ్చిక చేసుకొని స్నేహం చేసుకునేందుకు ప్రయత్నించింది. అయితే రోబో కుక్క దగ్గరకు వస్తున్న కొద్దీ చిన్న కుక్క పిల్ల బిగ్గరగా మొరుగుతూ దానిని దూరం తరిమే ప్రయత్నం చేసింది. అమెరికా సైనిక అవసరాల కోసం వినియోగించేందుకు గత ఏడాది ఈ రోబో కుక్కను రూపొందించారు. ఇది మొరగడంతో పాటు విధేయంగ ఆదేశాలను నిర్వర్తిస్తుంది. సైనిక విధుల్లో క్రియాశీలకంగా ఉపయోగించుకోవచ్చునని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు .

రజనీకాంత్ రోబోలా యాక్ట్ చేశారు. కాని ఇప్పుడు మనిషిలా యాక్టింగ్ చేసే రోబో హీరోలు హీరోయిన్లు కూడా వచ్చేస్తున్నారు. మాములు యాక్టర్లు ఇవ్వలేని హవభావాలను అత్యద్భుతంగా ఇస్తోంది రోబో తార.. ఈ రోబోలతో సినిమాలు నడిస్తే ఇక రానున్న కాలంలో హీరోయిన్లకు గడ్డు పరిస్థితి తప్పదు. జపాన్ చిత్ర నిర్మాతలు ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 'రోబో మూవీ స్టార్'ను సృష్టించారు. ముమ్మూర్తులా మనిషిలాగే ఉండే ఆ రోబో నవ్వగలదు, కనుబొమ్మల కదలికలతో హావభావాలను వ్యక్తం చేయగలదు, మనిషిలాగా మాట్లాడగలదు, పాడగలదు. ఎవరు డబ్బింగ్ చెప్పినా దానికి అనుగుణంగా పెదవులను కదలించగలదు. ప్రముఖ జపాన్ దర్శకుడు కోజి ఫుకడ నిర్మించిన 'సయోనారా' చిత్రంలో లియోనా పాత్రలో ఈ రోబో తార అద్భుతంగా నటించింది. ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే ఈ రోబో తారకు 'జెమినాయిడ్ ఎఫ్' అని నామకరణం కూడా చేశారు.

రోబోలతోను, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వల్లను వచ్చే లాభాలు చాలా ఉన్నాయి. అత్యంత నైపుణ్యంతో ఐదారు గంటలు చేసే సర్జరీ ఒక రోబో సునాయాసంగా ఖచ్చితంగా తక్కువ సమయంలో చేయవచ్చు. సరిహద్దుల్లో మందుపాతరలను రోబోలు తొలగించగలవు. అగ్ని ప్రమాదాల్లో మనుషులకు బదులు రోబోలు వెళ్ళి మంటలు ఆర్పవచ్చు. ఇలాంటి అనేక పనులు రోబోలు సునాయాసంగా చేయగలవు. విద్య, వైద్యం, బ్యాంకింగ్, పరిశ్రమలూ, దేశ భద్రత, వ్యవసాయం, అంతరిక్ష పరిశోధన... ఇలా ప్రతి రంగంలో రోబోలు ప్రవేశిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం విస్తృతంగా రోబోలపైన పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే వేలాది రోబోలు పారిశ్రామిక కార్మికులూ, డాక్టర్లూ, నర్సులూ, స్కూల్ టీచర్లూ, రిసెప్షనిస్టులూ, పోలీసులూ తదితరుల స్థానాల్ని భర్తీ చేస్తూ వివిధ రంగాల్లో సేవలందిస్తున్నాయి.

కేవలం రాబోయే ఏడు సంవత్సరాల్లోనే యంత్రాలు మనిషి జీవితంలో చాలా భాగాన్ని ఆక్రమించుకుంటాయి.రోబోట్లు ముఖ్యంగా ఎక్కౌంటింగ్, క్లయింట్ మేనేజిమెంట్, పరిశ్రమలు, పోస్టల్, సెక్రటరియల్ ఉద్యోగాలన్నింటిని ఆక్రమించుకుంటాయి. కాని సేల్స్, మార్కెటింగ్, కస్టమర్ సర్వీస్ వంటి రంగాల్లో యంత్రాలు ప్రవేశించడం కష్టం. ఈ కామర్స్ రంగంలో ఉద్యోగులకు మరింత శిక్షణ అవసరమవుతుంది. అలాగే సృజనాత్మక రంగాల్లోను మనిషికి యంత్రాల పోటీ ఉండదు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరిగేకొద్దీ మనిషి డమ్మీ అయిపోతాడా? అమెరికాలో 70శాతం మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మనుషులు చేసే నిర్ణయాల పని కూడా రోబోలే చేస్తున్నాయి. రోబోలతో తమ ఉద్యోగాలు పోతాయని కూడా అమెరికన్లు భయపడు తున్నారు. సిలికాన్ వ్యాలీలో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల సంఖ్య పెరుగుతోంది.

ఆటోమేషన్ వల్ల భారతదేశంలో 69 శాతం ఉద్యోగాలు పోవచ్చు. చైనాలో 77 శాతం ఉద్యోగాలు పోవచ్చని వరల్డ్ బ్యాంక్ రిసెర్చ్ చెబుతోంది. దీనివల్ల ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలపై 60 నుంచి 70శాతం ప్రభావం పడుతుంది. ఇదంతా కేవలం ఒక్క దశాబ్దంలో జరగబోతోంది. డిజిటైజేషన్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వల్ల కొత్త ఉద్యోగాలు వస్తాయి. కాని వాటిని అందుకోడానికి తగిన శిక్షణతో సిద్ధంగా ఉన్నవారికే అవి లభిస్తాయి. సైబర్ సెక్యురిటీ, క్లౌడ్, బిగ్ డాటా, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్ రంగాల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయి.

రోబోలు మనిషి జీవితంలో భాగమైపోయాయి. రోజు రోజుకు టెక్నాలజీ మారిపోతోంది. కొత్త టెక్నాలజీ మనిషికి అనేక సౌకర్యాలు తీసుకువస్తోంది. రానున్న కాలంలో మరిన్ని గొప్ప ఆవిష్కరణలు మన ముందుకురావచ్చు. కృత్రిమ మేధస్సుతో పనిచేసే యంత్రాల వల్ల మనిషి మనుగడకు ప్రమాదమా అనే భయాలు కూడా వినిపిస్తున్నాయిప్పుడు. ఏది ఏమైనా ప్రగతి మనిషి ప్రవృత్తి. అభివృద్ధి బాటపై నడుస్తూనే ఉంటాడు. కాని మనిషి గుర్తించవలసిని అసలు జీవిత లక్ష్యం ఏమిటన్నది. రోబోను తయారు చేసిన మనిషి ఆ రోబో తనకు విధేయంగా ఉండాలని కోరుకుంటాడు. అదేవిధంగా మనిషి కూడా తనను తయారు చేసిన సృష్టికర్తకు విధేయంగా ఉండాలి.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**